ప్రభాత సూర్య
PRABHATA SURYA
తెలుగు దిన పత్రిక
www.suryaa.news
వేల రూ.5/ - పేజీలు : 8 బుధవారం 3 సెప్టెంబర్ 2025 సంపుటి: 01, సంచిక : 79
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## త్వరలో అందుబాటులోకి రానున్న ఆన్‌లైన్ గేమింగ్ చట్టం

ప్రభుత్వం ఆన్‌లైన్ గేమింగ్ చట్టం అతి త్వరలో అందుబాటులోకి వస్తుందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ కార్యదర్శి ఎస్ కృష్ణన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 21న ఆన్‌లైన్ గేమింగ్ ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ చట్టం–2025ని పార్లమెంటు ఆమోదించిన సంగతి తెలిసిందే. ఈ చట్టం ఈ–స్పోర్ట్స్, ఇతర ఆన్‌లైన్ గేమ్‌లను ప్రోత్సహిస్తూనే అన్ని రకాల ఆన్‌లైన్ మనీ గేమ్‌లను నిషేధిస్తుంది. ఇప్పటికే దీనికి రాష్ట్రపతి ఆమోదం కూడా లభించింది. ప్రభుత్వం నోటిఫై చేసిన తర్వాత ఈ చట్టం అమల్లోకి వస్తుంది. అనుకున్న సమయం కంటే చాలా త్వరగా ఈ చట్టం అమలులోకి వస్తుంది. అందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎస్ కృష్ణన్ సెమీకండక్టర్లపై జరిగిన ఐసీఈఏ ఈవెంట్ సందర్భంగా అన్నారు.

విలేకరులు కావలెను
సీనియర్ జర్నలిస్టుల సారథ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.
96667 32777
ప్రభాత సూర్య
www.suryaa.news



# మరణించిన నా తల్లిని దూషిస్తారా


- ఇది అందరు అమ్మలు, అక్కచెల్లెళ్లను, ఆడబిడ్డలను అవమానించడమే : ప్రధాని
- బీసీ గద్దెనెక్కడం కాంగ్రెస్ సహించదు
- ఆర్జేడీ హయాంలో బిహార్లో నేరాల వెల్లువ
- ందుకే మహిళలే దించేశారు: మోదీ

**న్యూఢిల్లీ/పట్నా**

ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ బిహార్లో చేపట్టిన 'ఓటర్ అధికార యాత్ర'లో కాంగ్రెస్, ఆర్‌జేడీ నేతలు తన తల్లిని, తనను దూషించడంపై ప్రధాని మోదీ ఆవేదన వ్యక్తంచేశారు. నూరేళ్లు బతికి మరణించిన తన తల్లికి రాజకీయాలు తెలియదని.. ఆమెపై అనుచిత వ్యాఖ్యలు చేయడం.. తన తల్లినే గాక దేశంలోని అందరు అమ్మలు, అక్కచెల్లెమ్మలు, ఆడబిడ్డలను అవమానించడమేనని స్పష్టంచేశారు. స్వయం సహాయక - మిగతా2లో

# ఎన్నికల వాయిదాకే మొగ్గు?

**స్థానిక ఎన్నికలు రెండుమూడు నెలలు వాయిదా వేసే యోచన**
**అందుకోసం హైకోర్టుకు వెళ్లే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం!**
**రిజర్వేషన్ల బిల్లులకు ఆమోదం రాకపోవటమే ప్రధాన కారణం**



**హైదరాబాద్**

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ అంశం ఎటూ తేలకపోవడంతో.. వాటిని మరో రెండుమూడు నెలలు వాయిదా వేసే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. అందుకోసం హైకోర్టును ఆశ్రయించాలనే ఆలోచనతోప్రభుత్వం ఉన్నట్టుగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ నెల 30వ తేదీలోగా గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని గతంలో హైకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. కోర్టు ఆదేశాలను అమలుచేయటం ఇప్పటికిప్పుడు సాధ్యం కాదని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని ఎత్తేస్తూ అసెంబ్లీలో ఇటీవల బిల్లు ఆమోదించి గవర్నర్‌కు పంపిన విషయం తెలిసిందే. ఈ బిల్లుపై గవర్నర్ న్యాయ సలహా కోరుతూ న్యాయ నిపుణులకు పంపించినట్లు తెలిసింది. దీంతో బిల్లుపై నిర్ణయం తీసుకోడానికి రాజ్‌భవన్‌కు కొంత సమయం ఇచ్చి వేచిచూడాలనే యోచనతో ప్రభుత్వం ఉన్నట్టుగా అధికారవర్గాల ద్వారా తెలుస్తోంది. ఒకవేళ రాజ్‌భవన్ నుంచి ఈ బిల్లును రాష్ట్రపతికి పంపించినా వెంటనే అక్కడి నుంచి ఏదో ఒక నిర్ణయం వెలువడే అవకాశాలు తక్కువగానే ఉన్నాయనే వాదన వినిపిస్తోంది. అందువల్ల మరో రెండుమూడు నెలల తర్వాత బిహార్ అసెంబ్లీ ఎన్నికలు ముగిశాక రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉన్నట్టు చెబుతున్నారు. వెనుకబడిన తరగతుల వారికి స్థానిక సంస్థల్లో విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్ల కల్పన కోసం ముందుగా బీసీ సంక్షేమ శాఖ జీఓ ఇవ్వాల్సి ఉంటుంది. ఇది వచ్చాక పంచాయతీరాజ్ శాఖ రిజర్వేషన్ల ఫార్ములా ప్రకారం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు స్థానిక సంస్థల్లో కోటా నిర్ధారణ, ప్రభుత్వపరంగా ఎన్నికల తేదీల నిర్ణయాన్ని బట్టి ముందుకు వెళ్లాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఇదంతా పూర్తి కావటానికి మరికొంత సమయం పడుతుందని అంటున్నారు. ప్రభుత్వపరంగా రిజర్వేషన్ల ఖరారు, ఎన్నికల తేదీల నిర్ణయంతో సంబంధం లేకుండా రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల నిర్వహణ వేగవంతం చేసింది.



# కవితపై వేటు

- భారత రాష్ట్ర సమితి నుంచి సస్పెన్షన్
- అధినేత కేసీఆర్ సంచలన నిర్ణయం
- పార్టీకి నష్టం కలిగించే రీతిలో ఆమె వ్యవహరిస్తున్నారని ప్రకటన విడుదల
- పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా యోచనలో కవిత

**హైదరాబాద్**

తన కుమార్తె, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ భారత రాష్ట్ర సమితి అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. పార్టీకి నష్టం కలిగించే రీతిలో ఆమె వ్యవహరిస్తున్నందున కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు భారత రాష్ట్ర సమితి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. "పార్టీ ఎమ్మెల్సీ కె.కవిత ఇటీవల కాలంలో ప్రవర్తిస్తున్న తీరుతెన్నులు, కొనసాగిస్తున్న పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు భారత రాష్ట్ర సమితికు నష్టం కలిగించే రీతిలో ఉన్నందున.. అధిష్ఠానం ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తోంది. కవితను తక్షణం పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ భారత - మిగతా2లో




# చైనా ఆయుధ పాటవం

- నేడు బీజింగ్‌లో తొలిసారి భారీ ప్రదర్శన
- జిన్‌పింగ్, పుతిన్, కిమ్ సహా 26 దేశాల నేతల హాజరు
- అమెరికా తన బలాన్ని చాటేందుకు జూన్‌లో ఇలాంటి ప్రయత్నమే చేసింది.
- నాలుగో తరం యుద్ధ ట్యాంకులు, అత్యాధునిక విమానాలు, హైపర్‌సోనిక్ క్షిపణులు వంటివి ఉంటాయి.

5లో

# సుప్రీంకోర్టే సర్వోన్నతం!

- రాష్ట్రపతితో రగడపై సీజేఐ ధర్మాసనం
- న్యాయం కోసం ఏ ఆదేశాలైనా ఇస్తాం
- అవసరమైతే చట్టాలనూ పక్కన పెడతాం
- రాష్ట్రపతి లేఖ ఫక్తు 'రాజకీయ' వివాదమే
- అయినా సమాధానమిచ్చి తీరతాం: సీజేఐ



**న్యూఢిల్లీ**

రాజ్యాంగం ప్రకారం రాష్ట్రపతి, సుప్రీంకోర్టుల్లో ఎవరు సుప్రీం అన్న అత్యంత కీలకమైన అంశంపై ఆ రెండు వ్యవస్థల నడుమ కొన్ని నెలలుగా నివురుగప్పిన నిప్పులా సాగుతున్న పెను వివాదం ముదురు పాకాన పడింది. ఈ విషయమై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ సారథ్యంలోని ఐదుగురు న్యాయమూర్తుల విస్తృత ధర్మాసనం అత్యంత - మిగతా2లో

# మహిళల్లో కేసులెక్కువ.. పురుషుల్లో మరణాలెక్కువ

- దేశవ్యాప్తంగా కేన్సర్ కేసుల్లో కనిపిస్తున్న భిన్న వైఖరి
- 2015–19 మధ్య నమోదైన గణాంకాల ఆధారంగా తాజా అధ్యయనంలో వెల్లడి
- స్క్రీనింగ్ ద్వారా కేన్సర్‌ను ముందే గుర్తించే వీలుండటమే స్త్రీలలో తక్కువ మరణాలకు కారణం
- కేన్సర్ లక్షణాలను నిర్లక్ష్యం చేస్తుండటం వల్ల వ్యాధి ముదిరి మరణిస్తున్న పురుషులు
- మారిన ఆహార అలవాట్లు, జీవనశైలి మార్పులే కేసులకు ప్రధాన కారణమంటున్న నిపుణులు
- ఈ లెక్కన 2024లో 15.6 లక్షల కేసులు.. 8.74లక్షల మరణాలు నమోదై ఉండొొచ్చని అంచనా

5లో

# చిట్టీలపై జీఎస్టీ భారం

**పూర్తిగా తొలగిస్తే అనధికార చిట్టీలకు అడ్డుకట్ట**
**గుర్తింపు లేని నిర్వాహకుల ఆగడాలతో రోడ్డున పడుతున్న కుటుంబాలు**



**హైదరాబాద్**

నిబంధనల ప్రకారం చిట్‌ఫండ్ వ్యాపారం నిర్వహించే కంపెనీలకు జీఎస్టీ వసూళ్లు ప్రతిబంధకంగా మారాయి. చిట్టీలపై కంపెనీలకు వచ్చే కమీషన్‌పై 18 శాతం జీఎస్టీని ప్రభుత్వం వసూలు చేస్తోంది. చిట్టీ పాడుకున్న వ్యక్తి ఈ మొత్తాన్ని భరించాల్సి వస్తోంది. దాంతో ప్రైవేటు వ్యక్తులు ఎలాంటి అధికారిక గుర్తింపు లేకుండా నిర్వహించే చిట్టీలవైపు కొందరు మొగ్గుచూపుతున్నారు. వారు అకస్మాత్తుగా వ్యాపారం మానేసి పరారైతే కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. మోసం చేసేవారిపై కేసులు పెట్టడం తప్ప ప్రభుత్వం ఏమీ చేయలేకపోతోంది. ఇటీవల ఒక ప్రభుత్వ సంస్థలో పనిచేసే ఉద్యోగి కుటుంబం అనధికార చిట్టీలు నిర్వహించగా పలువురు రిటైర్డ్ ఉద్యోగులు వాటిలో చేరారు. బిచాణా ఎత్తేయడంతో చిట్టీలు, వడ్డీల పేరుతో ఆ కుటుంబం చేసిన మోసాలు బయటికి వచ్చాయి. పోలీసులు కేసు నమోదు చేసినా... ఆ కుటుంబం ఐపీ పిటిషన్ దాఖలు చేయడంతో బాధితులకు ఆర్థికంగా ఎలాంటి ఉపశమనం లభించలేదు. అనధికార చిట్టీలతో ప్రజలు మోసపోయే ప్రమాదం ఎక్కువగా - మిగతా2లో

# కవితపై వేటు



-మొదటిపేజీ తరువాయి

రాష్ట్ర సమితి అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రావు నిర్ణయం తీసుకున్నారు" అని పార్టీ ప్రధాన కార్యదర్శులు సోమ భరత్‌కుమార్, టి.రవీందర్‌రావు సంతకాలతో అధికారిక ప్రకటన వెలువడింది. కవితను సస్పెండ్ చేస్తూ కేసీఆర్ తీసుకున్న నిర్ణయాన్ని భారత రాష్ట్ర సమితి నేతలు స్వాగతించారు. మరోవైపు తన భవిష్యత్ కార్యాచరణపై కీలక అంశాలను కవిత బుధవారం వెల్లడించనున్నట్లు తెలిసింది.

**పార్టీ రజతోత్సవ సభ అనంతరం వెలుగులోకి విభేదాలు**

2014లో తొలిసారి నిజామాబాద్ నుంచి ఎంపీగా గెలుపొందిన కవిత.. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి చెందారు. అనంతరం నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా పార్టీ ఆమెకు అవకాశమిచ్చింది. అందులో గెలుపొంది.. శాసనమండలిలో అడుగుపెట్టారు.
2023 శాసనసభ ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి ఓటమి అనంతరం.. కవిత దిల్లీ మద్యం కేసులో అరెస్టయ్యారు.
బెయిలుపై విడుదలైన అనంతరం కొంత కాలం పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్న ఆమె.. తర్వాత బీసీ నినాదంతో ప్రజల్లోకి వెళ్లారు. భారత రాష్ట్ర సమితి పాలనలో సామాజిక న్యాయం జరగలేదంటూ కవిత చేసిన వ్యాఖ్యలు పార్టీ నేతలను ఉలికిపాటుకు గురిచేశాయి. అధిష్ఠానానికి సమాచారం ఇవ్వకుండా జిల్లాల్లో బీసీ ఉద్యమ సమావేశాలు నిర్వహించడం పార్టీ పెద్దలను అసహనానికి గురిచేసిందనే చర్చ అప్పుడే మొదలైంది.
గత ఏప్రిల్‌లో నిర్వహించిన భారత రాష్ట్ర సమితి రజతోత్సవ సభలో తన ఫొటో లేకపోవడం పట్ల కూడా కవిత అసంతృప్తికి గురైనట్లు ఆమె సన్నిహిత వర్గాల్లో చర్చ జరిగింది. తన వెనుక కొందరు కుట్ర చేస్తున్నారని ఆమె తెలంగాణ భవన్‌లోనే వ్యాఖ్యలు చేశారు.
రజతోత్సవ సభ అనంతరం కేసీఆర్‌ను ఉద్దేశించి కవిత రాసిన లేఖ ఆమె అమెరికా పర్యటనలో ఉన్నప్పుడు లీక్ కావడంతో.. హైదరాబాద్ తిరిగి రాగానే విమానాశ్రయంలో కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. తన తండ్రి కేసీఆర్‌కు అనేకసార్లు లేఖలు రాశానని, కొందరు కుట్రపూరితంగా ఆ లేఖను బయటపెట్టారని ఆరోపించారు. కేసీఆర్ దేవుడని.. కానీ, ఆయన చుట్టూ దెయ్యాలున్నాయని, పార్టీలో కోవర్టులున్నారన్నారు.
ఈ క్రమంలోనే తన నివాసంలో కవిత మీడియా చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. తాను జైల్లో ఉన్నప్పుడు భారత రాష్ట్ర సమితిని భాజపాలో విలీనం చేసే ప్రతిపాదనను తీసుకొచ్చారని చేసిన వ్యాఖ్యలు పార్టీలో ప్రకంపనలు సృష్టించాయి. అప్పుడే ఆమెపై పార్టీ చర్య తీసుకుంటుందనే చర్చ జరిగింది.
కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ ఘోష్ కమిషన్ వద్దకు కేసీఆర్ విచారణకు బయలుదేరే సందర్భంలో ఎర్రవల్లి నివాసానికి వెళ్లిన కవితతో.. కేసీఆర్ మాట్లాడలేదని అప్పట్లో ప్రచారం జరిగింది.
ఇటీవల తన కుమారుడు ఉన్నత విద్యాభ్యాసం కోసం అమెరికాకు వెళ్తున్న సందర్భంలోనూ తండ్రి ఆశీర్వాదం కోసం వెళ్లిన కవితకు నిరాశే ఎదురైందని పార్టీ వర్గాలు చెప్పాయి.
ఈ క్రమంలోనే కవితను ఉద్దేశించి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలపై భారత రాష్ట్ర సమితి నాయకులు స్పందించకపోవడం కూడా ఆమెలో మరింత అసంతృప్తిని పెంచినట్లు తెలుస్తోంది.
ఈ పరిణామాల నేపథ్యంలోనే భారత రాష్ట్ర సమితి సీనియర్ నేత జగదీశ్‌రెడ్డిని ఉద్దేశించి ఆమె పరోక్షంగా చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి.
తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం గౌరవాధ్యక్ష పదవి నుంచి కవితను తొలగించడంతో వివాదం మరింత ముదిరింది. తనపై కొందరు కుట్రలు చేస్తున్నారని ఈ సందర్భంగా లేఖలో ఆమె ఆరోపించారు.
కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం సీబీఐ విచారణ కోరిన నేపథ్యంలో కవిత విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి.. కాళేశ్వరం అవినీతిలో హరీశ్‌రావు, సంతోష్‌ల పాత్ర ఉందంటూ చేసిన వ్యాఖ్యలు భారత రాష్ట్ర సమితిలో అలజడి సృష్టించాయి.
కవిత వ్యాఖ్యలు పార్టీకి తీవ్ర నష్టం కలగజేస్తున్నాయని అధినేత వద్ద కొందరు నేతలు అభిప్రాయం వ్యక్తం చేశారు.
ఎర్రవల్లి నివాసంలో కేసీఆర్‌తో కేటీఆర్, జగదీశ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, డాక్టర్ సంజయ్ సహా పలువురు నేతలు సమావేశమై ఈ అంశంపై తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు. ఈ వ్యవహారంపై పార్టీ సీనియర్లతో పాటు.. పార్టీ జిల్లా శాఖల అధ్యక్షులు, నాయకులు, సామాజిక మాధ్యమాల ద్వారా కార్యకర్తలు, అభిమానుల అభిప్రాయాలను కేసీఆర్ తెలుసుకున్నారని పార్టీ వర్గాలు చెప్పాయి.
అనంతరం కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ అధినేత నిర్ణయం తీసుకున్నారు.
సన్నిహితులతో కవిత సమావేశం..
పార్టీ నుంచి సస్పెండ్ చేశారని తెలుసుకున్న కవిత.. జాగృతి నాయకులు, సన్నిహితులతో సమావేశమయ్యారు. భారత రాష్ట్ర సమితి ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేయడంతోపాటు ఎమ్మెల్సీ పదవినీ వదులుకోవాలని ఆమె నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. బుధవారం మీడియా సమావేశాన్ని ఏర్పాటుచేసి భవిష్యత్ కార్యాచరణ ప్రకటించనున్నట్లు సమాచారం. కొత్త పార్టీ ఏర్పాటుపైనా ఆమె సమాలోచనలు చేస్తున్నట్లు తెలిసింది. కవిత సస్పెన్షన్ వార్త తెలియగానే.. బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయానికి మద్దతుదారులు భారీగా తరలివచ్చి ఆమెకు అనుకూలంగా నినాదాలు చేశారు.

# సుప్రీంకోర్టే సర్వోన్నతం!

-మొదటిపేజీ తరువాయి

కీలక వ్యాఖ్యలు చేసింది. ఏ కేసులోనైనా సరే, సంపూర్ణ న్యాయం చేకూర్చేందుకు అవసరమైన అన్ని రకాల ఆదేశాలూ ఇచ్చి తీరతామని కుండబద్దలు కొట్టింది. "అందుకోసం అవసరమతే ప్రస్తుత చట్టాల్లోని లోపాలను బేఖాతరు చేయాల్సి వచ్చినా ఏ మాత్రమూ వెనకాడబోం. ఎందుకంటే ఆర్టికల్ 142 కింద సుప్రీంకోర్టుకు స్వయానా రాజ్యాంగమే కట్టబెట్టిన అసాధారణమైన విచక్షణాధికారమది" అని కుండబద్దలు కొట్టింది. అంతేగాక, అత్యున్నత న్యాయస్థానానికి దఖలు పడ్డ న్యాయ సమీక్షాధికారం రాజ్యాంగ మౌలిక నిర్మాణంలో భాగమని చరిత్రాత్మకమైన మినర్వా మిల్స్ కేసును ఉటంకిస్తూ గుర్తు చేసింది. తద్వారా, సుప్రీంకోర్టు అధికార పరిధికి అంతిమంగా రాష్ట్రపతి కూడా లోబడాల్సిందేనని చెప్పకనే చెప్పింది.
అసెంబ్లీలు ఆమోదించే బిల్లులపై నిర్ణయం తీసుకునేందుకు గవర్నర్లతో పాటు ఏకంగా రాష్ట్రపతికి కూడా 3 నెలల గడువు విధిస్తూ సీజేఐ ధర్మాసనం ఇటీవల వెలువరించిన తీర్పు దేశవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించడం తెలిసిందే. దానిపై కీలక రాజ్యాంగపరమైన సందేహాలు లేవనెత్తుతూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నేరుగా సుప్రీంకోర్టుకే లేఖ రాయడం మరింత సంచలనంగా మారింది. దానిపై సీజేఐ ధర్మాసనం ఎదుట మంగళవారం ఆరో రోజు కూడా విచారణ కొనసాగింది. రాజ్యాంగపరమైనవంటూ ఈ విషయమై రాష్ట్రపతి లేవనెత్తిన సందేహాలు వాస్తవానికి రాజకీయపరమైనవవేనని ఈ సందర్భంగా ధర్మాసనం తేల్చేసింది. అయినా సరే, రాష్ట్రపతి లేవనెత్తిన 'రాజ్యాంగపరమైన' ప్రశ్నలకు సమాధానం నిరాకరించజాలమని పేర్కొంది. రాష్ట్ర అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులను ఆమోదించే విషయంలో రాష్ట్రపతికి, గవర్నర్లకు గడువు విధిస్తూ ఆదేశాలిచ్చే అధికారం సుప్రీంకోర్టుకు ఉందో లేదో తేల్చాలంటూ ఆర్టికల్ 143(1) కింద దఖలు పడ్డ విచక్షణాధికారాలను వాడుకుంటూ ద్రౌపదీ ముర్ము గత మే నెలలో సీజేఐకి లేఖ రాసింది.

**వారికి ఆ అధికారాల్లేవ్!**

గవర్నర్లు బిల్లులకు ఆమోదం తెలపకుండా తొక్కిపెట్టడం ప్రజాభీష్టాన్ని కాదనడమేనని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వ్యవహరించాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతూ చరిత్రలోనే మొదటిసారిగా సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిందన్నారు. "ఒక వ్యవస్థ మరో వ్యవస్థకు అవరోధంగా మారేందుకు రాజ్యాంగంలోని ఏ సూత్రమూ అనుమతించదు. అసలు విచక్షణ అనే భావనే ఆర్టికల్ 200కు ఫక్తు విరుద్ధం. గవర్నర్ నిర్వర్తించేది రాజ్యాంగ విధి, అంతే తప్ప స్వేచ్ఛాయుత ఎంపిక కాదు' అని వాదించారు. రాష్ట్రపతి, గవర్నర్ల చర్యలు రాజ్యాంగ సమీక్షకు అతీతమని కేంద్రం భావిస్తోందంటూ తమిళనాడు ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వి మండిపడ్డారు. అలా బిల్లులను ఆపేసేందుకు రాష్ట్రపతికి, గవర్నర్లకు ఎలాంటి స్వతంత్ర అధికారాలూ లేవని వాదించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌తో సహా పలు రాష్ట్రాల్లో తలెత్తిన న్యాయ వివాదాలను సింఘ్వి తన వాదనకు మద్దతుగా ప్రస్తావించారు. దాన్ని కేంద్రం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తీవ్రంగా తప్పుబట్టారు. "అలాంటి కేసులనే వాదనలకు ఆధారంగా చూపదలిస్తే మేం (కేంద్రం) కూడా లిఖితపూర్వకంగా సమాధానం సమర్పించాల్సి వస్తుంది. స్వతంత్రం వచ్చిన నాటినుంచీ కొన్ని రాష్ట్రాల్లో రాజ్యాంగాన్ని అడ్డంగా తుంగలో తొక్కుతూ వచ్చారు. ఆ మురికమయమైన గతాన్ని తవ్విపోయాలనే మీరు భావిస్తుంటే అందుకు సంబంధించిన పూర్తి రికార్డులను మేం కోర్టు ముందుంచుతాం" అని సింఘ్వి, సిబల్‌లను ఉద్దేశించి స్పష్టం చేశారు. సీజేఐ కల్పించుకుని వాతావరణాన్ని చల్లబరిచే ప్రయత్నం చేశారు. "ఆంధ్రప్రదేశ్ కావచ్చు, తెలంగాణ, కర్నాటక కావచ్చు, మేం కేవలం రాజ్యాంగంలోని నిబంధనలకు నిర్వచిస్తామంతే. అంతకంటే మరేమీ లేదు" అంటూ వాదనలను రాజ్యాంగపరమైన అంశాలపైకి మళ్లించారు. విచారణ బుధవారం కూడా కొనసాగనుంది.


**మినర్వా కేసు.. మైలురాయి!**

న్యాయసమీక్ష రాజ్యాంగ మౌలిక నిర్మాణంలో భాగమంటూ ధర్మాసనం ఉటంకించిన మినర్వా మిల్స్ కేసును భారత న్యాయచరిత్రలోనే అతి కీలక మైలురాయిగా పేర్కొంటారు. ఏ విషయంపై అయినా నిర్ణయాలు తీసుకునే విషయంలో రాజ్యాంగ మౌలిక నిర్మాణ సిద్ధాంతమే సర్వోన్నతమంటూ సుప్రీంకోర్టు వెలువరించిన చరిత్రాత్మక తీర్పుకు మినర్వా కేసే నిమిత్తంగా నిలిచింది.

# మేడారంలో స్మృతివనం ఏర్పాటుకు రూ.38 కోట్లు మంజూరు

తాడ్వాయి (ములుగు)

ములుగు జిల్లా మేడారం అంటే రెండేళ్లకోసారి జరిగే మహాజాతరనే గుర్తుకొచ్చేది. అలాంటి క్షేత్రం ప్రస్తుతం 3 వేల మంది భక్తులతో నిత్య జాతరలా కనిపిస్తోంది. సెలవులు, ఆదివారాల్లో ఈ సంఖ్య 10 వేలు దాటుతోంది. ముఖ్యంగా రామప్ప, లక్నవరం, బొగత జలపాతం సందర్శనకొచ్చే పర్యాటకులు ఇక్కడి వనదేవతలు సమ్మక్క, సారలమ్మలనూ దర్శించుకొని వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ క్షేత్రాన్ని పర్యాటక ప్రాంతంగా మరింత అభివృద్ధి చేస్తోంది. అమ్మవార్లకు ప్రభుత్వం కేటాయించిన నారిగెబంధం గుట్టపై ఉన్న 28.95 ఎకరాల్లో స్మృతివనం ఏర్పాటు చేయాలని నిర్ణయించి.. రూ.38 కోట్లు మంజూరు చేసింది. మేడారంలో ఒక నిర్మాణానికి ఇంత పెద్దమొత్తంలో నిధులివ్వడం ఇదే మొదటిసారి. 28.95 ఎకరాల చుట్టూ భవనాలు నిర్మించి మధ్యలో ఈత కొలను, గడ్డి మైదానాలు, ఆట స్థలాలు, దేవతల చరిత్ర, ఆదివాసీల సంస్కృతి ఉట్టిపడేలా నిర్మాణాలు



చేపట్టనుంది. జంపన్నవాగు పరిసరాల సుందరీకరణకు ప్రభుత్వం ఇటీవల రూ.5 కోట్లు మంజూరు చేసింది. గద్దెల ప్రాంగణానికి కొద్దిదూరంలోని ఈ విశాల ప్రదేశంలో ఇప్పటికే దేవాదాయశాఖ విడిది గృహాలు నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించింది. ఇక స్మృతివనమూ ఏర్పాటైతే మేడారం ముఖచిత్రం మారిపోనుంది

## చిట్టీలపై జీఎస్టీ భారం

-మొదటిపేజీ తరువాయి

ఉంటుందని, వాటితో భద్రత ఉండదని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అభిప్రాయపడ్డారు. ప్రధాని మోదీ జీఎస్టీ శ్లాబ్‌ల సంఖ్యను తగ్గిస్తామని ప్రకటించిన నేపథ్యంలో చిట్‌ఫండ్‌లపై జీఎస్టీని పూర్తిగా రద్దుచేస్తే అనధికార చిట్టీలకు అడ్డుకట్ట పడుతుందని, వీలుకాని పక్షంలో కనీసం 18% నుంచి 5శాతానికి తగ్గించాలని చిట్‌ఫండ్ కంపెనీలు కోరుతున్నాయి.
చిట్‌ఫండ్ వ్యాపారాన్ని ఆదుకోవాలి: తెలంగాణ చిట్ ఫండ్స్ ఫెడరేషన్
"చిట్‌ఫండ్ కంపెనీలు వసూలుచేసే చిట్టీ కమీషన్‌పై పాట పాడుకున్న వ్యక్తి నుంచి 18% జీఎస్టీ వసూలుతో సామాన్యులపైనే ఆర్థికభారం పడుతోంది. ప్రభుత్వ నియంత్రణలోని ప్రముఖ చిట్‌ఫండ్ కంపెనీలు పక్కాగా నిర్వహించే చిట్టీ గ్రూపులలో పారదర్శకత ఉంటుంది. ఈ వ్యాపారంపై జీఎస్టీని పూర్తిగా తొలగించి ఆదుకోవాలని ఉపముఖ్యమంత్రి భట్టికి మంగళవారం వినతిపత్రం అందజేశాం. సానుకూలంగా స్పందించారు" అని తెలంగాణ చిట్ ఫండ్స్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ కె.శ్రీనివాస్‌రెడ్డి, ఛైర్మన్ రాజాజీ, సెక్రటరీ జనరల్ ఎల్.సుమన్‌లు తెలిపారు. జీఎస్టీ అమల్లోకి వచ్చినప్పుడు దేశవ్యాప్తంగా చిట్‌ఫండ్ కంపెనీల చిట్టీ వేలంపాటల టర్నోవర్ రూ.50వేల కోట్ల నుంచి రూ.35వేల కోట్లకు తగ్గిందని, ఆమేర అనధికార చిట్టీలు పెరుగుతున్నాయని భట్టికి వివరించినట్లు చెప్పారు.

## నూతన ఆవిష్కరణలతో నేరాల నియంత్రణ: డీజీపీ




గచ్చిబౌలి

సరికొత్త ఆవిష్కరణలతో నేరాల నియంత్రణకు కృషి చేస్తున్నామని రాష్ట్ర డీజీపీ జితేందర్ తెలిపారు. గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ ప్రాంగణంలో మంగళవారం తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీసీఎస్‌బీ)తో కలిసి ఏర్పాటు చేసిన వ్యూహ ల్యాబ్‌తో పాటు సైబర్ మంథన్ సెంటర్‌ను డీజీపీ ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో నమోదవుతున్న కేసుల్లో 20 నుంచి 25 శాతం సైబర్ నేరాలే ఉంటున్నాయన్నారు. గతేడాదితో పోల్చితే, గడిచిన ఆరు నెలల కాలంలో సైబర్ నేరాలు 11 శాతం తగ్గినట్లు తెలిపారు. సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేసేందుకే ట్రిపుల్ ఐటీతో కలిసి వ్యూహ ల్యాబ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయల్ మాట్లాడుతూ..సైబర్ నేరాలపై టీజీసీఎస్‌బీకి నిత్యం 250 ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. బాధితులు నిత్యం రూ.4–5 కోట్లు నష్టపోతున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వ్యూహ ల్యాబ్‌తో కలిసి పనిచేసేందుకు తెలంగాణ పోలీసు శాఖ, హైదరాబాద్ ట్రిపుల్ ఐటీల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఆయా పత్రాలపై డీజీపీ జితేందర్, టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయల్, ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ సందీప్ శుక్లా, మాజీ డైరెక్టర్ పీజే నారాయణన్ సంతకాలు చేశారు. అనంతరం డీజీపీ ట్రిపుల్ ఐటీ 28వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పూర్వ విద్యార్థులు నవీనా యనమల, మనీశ్ జైన్లకు 'అలుమ్ని ఎచీవర్ అవార్డు–2025'ను అందజేశారు. కార్యక్రమంలో ఐల్యాబ్స్ క్యాపిటల్ ఛైర్మన్ శ్రీని రాజు, టీజీసీఎస్‌బీ ఎస్పీ హర్షవర్ధన్, మాదాపూర్ డీసీపీ డాక్టర్ జి.వినీత్ పాల్గొన్నారు.

## విమాన ఇంధనాన్ని కల్తీ చేస్తారా?




హైదరాబాద్

పెట్రోల్, డీజిల్‌లో కల్తీకి పాల్పడితే వాహనాలు రోడ్డుపై ఆగిపోతాయని, విమాన ఇంధనం కల్తీ చేస్తే ఎక్కడ ఆగాలని పిటిషనర్‌పై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కల్తీ కారణంగా విమానం కూలి మనుషుల ప్రాణాలుపోతే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించింది. కనీస మానవత్వం అంటూ లేకుండా అక్రమాలకు పాల్పడితే ఎలా ఉపేక్షించాలంటూ ఘాటు వ్యాఖ్యలు చేసింది. కాంట్రాక్టు పునరుద్ధరించాలంటూ దాఖలైన పిటిషన్‌ను ఎంత మాత్రం ఆమోదించబోమని.. కొట్టివేసింది. ట్యాంకర్లలో ఇంధనాన్ని కల్తీ చేస్తున్నారని సోషల్ మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) కాంట్రాక్టు రద్దు చేయడాన్ని సవాల్ చేస్తూ కాంట్రాక్టర్ గురునాథం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ నగేశ్ భీమపాక మంగళవారం విచారణ చేపట్టారు. ఆయిల్ ట్యాంకర్లో ఏదో శబ్దం వస్తుండటంతో నిలిపి పైకెక్కి చూశారని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. దీన్ని కొందరు వీడియోలు తీసి కల్తీ అంటూ సోషల్ మీడియాలో పెట్టారన్నారు. కల్తీపై విచారణ జరపకుండానే కాంట్రాక్టు రద్దు చేయడం సరికాదని వాదించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. విమాన ఇంధనంలో కల్తీకి పాల్పడితే ఎలాంటి పరిణామాలు సంభవిస్తాయో తెలియదా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ మార్గాల్లో సంపాదించే డబ్బు తప్ప ప్రజల ప్రాణాలు కనిపించవా అని ప్రశ్నించారు. కాంట్రాక్టు రద్దు చేయడంలో జోక్యం చేసుకోబోమంటూ.. పిటిషనర్‌కు రూ. 10 లక్షల జరిమానా విధిస్తూ పిటిషన్‌ను కొట్టివేశారు.

## టీడీపీని స్థాపించి ఎన్టీఆర్ చిరస్మరణీయుడయ్యారు

గన్నవరం



సినిమా నటుడుగా అభిమానుల మనస్సులో తిరుగులేని స్థానం సాధించిన ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించి, ప్రజలకు సేవచేయటం ద్వారా ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం పొందారని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అభిప్రాయపడ్డారు. నందమూరి హరికృష్ణ 69వ జన్మదిన పురస్కరించుకొని ఎన్టీఆర్ స్వగ్రామమైన నిమ్మకూరులో మంగళవారం ఉదయం ఏర్పాటు చేసిన మెగా వైద్యశిబిరం, రక్తదాన శిబిరం ప్రారంభోత్సవంలో యార్లగడ్డ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో యార్లగడ్డ ప్రసంగిస్తూ రాష్ట్రంలో ఎంతోమంది సినీ నటులు పేరు ప్రఖ్యాతులు సాధించినప్పటికీ, తెలుగు ప్రజల గుండెల్లో తిరుగులేని స్థానం దక్కించుకుంది మాత్రం ఎన్టీ రామారావే అన్నారు. తెలుగుదేశం పార్టీని స్థాపించి ఆరు నెలల్లోనే ముఖ్యమంత్రి అయిన ఆయన పేదలకు రెండు రూపాయలకే కిలో బియ్యం, రాయితీపై జనతా వస్త్రాలు వంటి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడంతోపాటు, మహిళలకు ఆస్తిలో సమాన హక్కు వంటి చట్టం చేయటం ద్వారా ప్రజలకు చేరువయ్యారన్నారు. ప్రపంచంలో 60 సంవత్సరాల వయసులో పార్టీని స్థాపించి ముఖ్యమంత్రి పదవిని చేపట్టటం ఎన్టీ రామారావు కె సాధ్యమైందని ఎమ్మెల్యే వెంకట్రావ్ కొనియాడారు. “శక్తివంతమైన నాయకులు అత్యంత శక్తివంతమైన ప్రదేశాల నుండి వస్తారన్న” ఇంగ్లీష్ నానుడికి భిన్నంగా ఎన్టీ రామారావు వల్ల కుగ్రామమైన నిమ్మకూరు గ్రామానికి పేరు ప్రఖ్యాతులు వచ్చాయన్నారు. రాజ్యసభ పదవిని త్యాగం చేసి సమైక్యాంధ్ర ఉద్యమానికి అండగా నిలిచిన వ్యక్తి హరికృష్ణ అని గుర్తు చేశారు. సమైక్య ఉద్యమం సమయంలో రాష్ట్రంలో ఎంతోమంది ప్రజా ప్రతినిధులు రాజీనామాలు చేసినప్పటికీ సమైక్య రాష్ట్రం కోసం పదవికీ రాజీనామా చేసిన ఏకైక నాయకుడు హరికృష్ణ అని పేర్కొన్నారు. టిడిపి పార్టీ స్థాపించిన సమయంలో తండ్రి ఎన్టీఆర్ రాష్ట్ర పర్యటనలో వాహనాన్ని నడిపిన హరికృష్ణ నమ్మిన సిద్ధాంతం కోసం చివరి వరకు పనిచేశారని చెప్పారు. హరికృష్ణతో తనకు గల అనుబంధాన్ని ఈ సందర్భంగా యార్లగడ్డ గుర్తు చేసుకున్నారు. టీడీపీ స్థాపించిన తరువాత ఇప్పటి వరకు ఏ ఎన్నికల్లోను గన్నవరం నియోజకవర్గంలోని మానికొండ గ్రామంలో టీడీపీకి మెజార్టీ రాలేదని అసెంబ్లీ ఎన్నికల సమయంలో నందమూరి రామకృష్ణ ఆ గ్రామంలో ప్రచారం చేయటంతో తొలిసారి మానికొండలో టీడీపీ అధిక్యత సాధించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మంత్రి కొల్లు రవీంద్ర, నందమూరి సుహాసిని, నందమూరి రామకృష్ణ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ, గుడివాడ ఎమ్మెల్యేలు వర్ల కుమార్ రాజా, వెనిగండ్ల రాము, రావి వెంకటేశ్వరరావు, గొట్టిపాటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే యార్లగడ్డ



గన్నవరం

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పాల్గొన్నారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం ఉదయం జనసేన నాయకుల ఆధ్వర్యంలో జరిగిన పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే యార్లగడ్డ కేక్ కోసి జన శ్రేణులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా 50 మంది పారిశుధ్య కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ ఐదు సంవత్సరాల క్రితం రాష్ట్రంలో ఉన్న దుర్భర పరిస్థితులు అరాచక పాలన నుండి రాష్ట్రాన్ని రక్షించేందుకు టిడిపి, బిజెపితో కలిసి కూటమి ఏర్పాటు చేయటంలో పవన్ కళ్యాణ్ చొరవ అభినందనీయమన్నారు. అక్రమ కేసులతో చంద్రబాబు నాయుడు జైల్లో పెట్టినప్పుడు జైలుకు వెళ్లి చంద్రబాబును పరామర్శించిన పవన్ షరతులు లేకుండా మద్దతు ప్రకటించి రాష్ట్ర ప్రజల మన్ననలను చూరగొన్నారని పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి రాష్ట్ర అభివృద్ధిలో భాగం పంచుకున్నారని పవన్ కళ్యాణ్ ఆశయాలు అనుగుణంగా జనసైనికులు పనిచేయాలని పిలుపునిచ్చారు. గత ఎన్నికల్లో తన విజయం కోసం వివిధ కార్యక్రమంలో బిజీగా ఉన్నప్పటికీ హనుమాన్ జంక్షన్ భారీ బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారని గుర్తు చేసుకున్నారు. మరో 15 ఏళ్ల పాటు కూటమి ఐక్యమత్యంతో ఉంటుందని ప్రకటించిన పవన్ కళ్యాణ్ రాష్ట్ర అభివృద్ధి కోసం తహతహలాడుతున్నారని, ఆయన ఆశయాలకు అనుగుణంగా కూటమి నాయకులు, కార్యకర్తలు కలిసిమెలసి పనిచేసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామని యార్లగడ్డ సూచించారు. జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమల శెట్టి రమేష్ బాబు మాట్లాడుతూ తమ పార్టీలో కార్యకర్తలకే పెద్దపేట వేస్తూ త్రిశూల వ్యూహాన్ని అనుసరిస్తున్నామన్నారు. పవన్ కళ్యాణ్ నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కొల్లా ఆనంద్ కుమార్, చిమటా రవి వర్మ, నాభిగాని కొండ, సాంబశివనాగరాజు, కూనపురెడ్డి నాని, హరి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## నవంబరు కల్లా అమెరికాతో వాణిజ్య ఒప్పందం

న్యూఢిల్లీ

అమెరికాతో వాణిజ్య చర్చలు కొనసాగుతున్నాయని.. త్వరలోనే పరిస్థితులన్నీ చక్కబడతాయని.. నవంబరుకల్లా ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదురుతుందని ఆశిస్తున్నామని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. ముంబైలో జరుగుతున్న అంతర్జాతీయ పెట్టుబడిదారుల వార్షిక సదస్సును ఉద్దేశించి వర్చువల్‌గా ప్రసంగించిన గోయల్.. భారత్‌తో వాణిజ్య, వ్యాపార సంబంధాలను పెంచుకోవాలనే ఆసక్తి, ఉత్సాహం ప్రపంచవ్యాప్తంగా పెరుగుతోందని అన్నారు. ఈయూతో స్వేచ్ఛావాణిజ్య ఒప్పందానికి సంబంధించిన చర్చలు కూడా చివరి దశకు చేరుకున్నాయని తెలిపారు. అలాగే.. అంతకుముందు మరో కార్యక్రమంలో మాట్లాడుతూ అమెరికాతో చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు. అయితే, భారతదేశం ఎప్పుడూ డెడ్‌లైన్స్ పెట్టుకొని వాణిజ్య చర్చలు జరపదని.. పరస్పర ప్రయోజనకరంగా ఉండే ఒప్పందాలపై మాత్రమే చర్చలు జరుపుతుందని ఆయన స్పష్టం చేశారు.

# మరణించిన నా తల్లిని దూషిస్తారా

-మొదటిపేజీ తరువాయి

బృందాల(ఎస్‌జీహెచ్ గ్రూపులు)కు ఆర్థిక సాయం చేయడానికి సీఎం నితీశ్‌కుమార్ సారథ్యంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పాటుచేసిన ‘జీవికా నిధి సాఖ్ సహకారీ సంఘ్ లిమిటెడ్’ సంస్థను మోదీ మంగళవారం ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ‘అమ్మ ప్రతి ఒక్కరి ఆత్మగౌరవం. కొద్దిరోజుల కిందట దర్భంగాలో జరిగిన కాంగ్రెస–ఆర్‌జేడీ సభ వేదికపై నా తల్లిని దూషించారు. సంప్రదాయ విలువలకు పేరుగాంచిన బిహార్ నేలపై ఇలాంటి ఘటన జరుగుతుందని నేనెన్నడూ ఊహించలేదు. బిహార్లో ఇది చూసిన ప్రతి తల్లీ ఇందుకు ఎంతగానో బాధపడుతోందని నాకు తెలుసు. నా గుండెల్లో ఉన్నంత బాధే వారిలో కూడా ఉంది. భారత మాతనే అవమానించేవారికి.. నా తల్లి పట్ల అలాంటి అసభ్య పదాలు వాడడం పెద్ద లెక్కలోది కాదు. ఇలాంటివారిని శిక్షించాలి. నా తల్లికి రాజకీయాలతో సంబంధం లేదు. ఆమె తప్పేంటి..? ఎందుకు దూషించాలి? బిహార్ సీతామాత జన్మభూమి. కాంగ్రెస్, ఆర్‌జేడీలను నేను క్షమించినా.. బిహార్ తల్లులు క్షమించరు’ అని మోదీ అన్నారు. తనకు జన్మనిచ్చిన తల్లి మాతృభూమికి సేవచేయాలని తనను కోరిందని.. అందుకే దేశంలో మహిళల సంక్షేమానికి తాను అవిశ్రాంతంగా కృషిచేస్తున్నానని తెలిపారు. ఆమె తన కోసం చీర కూడా కొనుక్కుని ఎరుగదని చెప్పారు. మహిళా వ్యతిరేక మనస్తత్వం ఉన్నవారు అధికారంలోకి వస్తే.. అమ్మలు, అక్కచెల్లెళ్లు, ఆడబిడ్డలు ఎక్కువ బాధలు పడాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆర్‌జేడీ హయాంలో రాష్ట్రంలో నేరాలు, హత్యలు, దోపిడీలు, అత్యాచారాలు, వసూళ్లు నిత్యకృత్యమని గుర్తుచేశారు. హంతకులు, రేపిస్టులకు ఆర్‌జేడీ ప్రభుత్వం రక్షణ కల్పించిందన్నారు. నాడు మహిళలే ఎక్కువగా బా?ధలు పడ్డారని.. వారే ఆ ప్రభుత్వాన్ని దించేశారని చెప్పారు. వెనుకబడిన వర్గాలకు చెందినవారు అధికారంలోకి రావడాన్ని కాంగ్రెస్ ఎప్పుడూ సహించదని.. అందుకే తనను దూషిస్తోందని మోదీ ధ్వజమెత్తారు.

**తక్కువ వడ్డీతో రుణాలు..**


స్వయం సహాయక బృందాలకు తక్కువ వడ్డీతో రుణాలు/ఆర్థిక సాయం అందించడం నితీశ్ సర్కారు ప్రారంభించిన ‘జీవికా నిధి’ లక్ష్యం. ఈ సంస్థ నిర్వహణకు రాష్ట్రప్రభుత్వం, కేంద్రం కూడా నిధులు అందిస్తాయి. మహిళా పారిశ్రామికవేత్తలు ఆర్థిక సాయం కోసం ప్రస్తుతం సూక్ష్మ ఆర్థిక సంస్థలపై ఆధారపడుతున్నారు. 18–24 శాతం వడ్డీ చెల్లించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో మహిళలకు తక్కువ వడ్డీలతో సకాలంలో ఆర్థిక సాయం అందించే జీవికా నిధిని ఏర్పాటుచేశారు. ఈ వ్యవస్థ పూర్తిగా డిజిటల్ లావాదేవీలే నడుస్తాయి. దీని ద్వారా ‘జీవికా దీదీల’ బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా నిధులు బదిలీ అవుతాయి.

కాంగ్రెస్ నేత ఖేడాకు రెండు ఓటరు ఐడీలు

కాంగ్రెస్ మీడియా విభాగం ఇన్‌చార్జి పవన్ ఖేడాకు వేర్వేరు నంబర్లతో రెండు ఓటరు ఫొటో గుర్తింపు కార్డులు ఉన్నాయని బీజేపీ ఆరోపించింది. బిహార్‌లో ఓట్ల చోరీ జరిగిందని రాహుల్ గాంధీ గగ్గోలు పెడుతున్నారని, కానీ అసలు ‘ఓట్ల దొంగ’ కాంగ్రెస్సేనని విమర్శించింది. ఖేడాకు రెండు ఓటరు ఐడీలు ఎలా వచ్చాయో ఎన్నికల సంఘం(ఈసీ) దర్యాప్తు చేయాలని డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో ఢిల్లీ ఎన్నికల సంఘం ఖేడాకు నోటీసులు జారీ చేసింది. ఈ నెల 8వ తేదీ 11 గంటల్లోపు సమాధానం ఇవ్వాలని సూచించింది. బీజేపీ ఆరోపణలపై ఖేడా స్పందిస్తూ ఆ పార్టీ నాయకులు చెప్పిన తర్వాతే తనకు రెండో ఓటరు ఐడీ ఉన్నట్లు తెలిసిందన్నారు. దీన్ని బట్టి ఓటర్ల జాబితాలు ఎంత లోపభూయిష్టంగా ఉన్నాయో తేటతెల్లమవుతోందన్నారు. దీనికి ఈసీనే నిందించాలని, ఓటర్ల జాబితాలను సక్రమంగా నిర్వహించడంలో ఈసీ విఫలమైందని విమర్శించారు.

# మహిళల్లో కేసులెక్కువ.. పురుషుల్లో మరణాలెక్కువ

న్యూఢిల్లీ



దేశంలో కేన్సర్ వ్యాధి కేసులు, మరణాల్లో భిన్న వైఖరి కనిపిస్తోంది. మహిళల్లో కేన్సర్ కేసులు ఎక్కువగా నమోదవుతుండగా పురు షుల్లో మాత్రం కేన్సర్ మరణాలు అధికంగా సంభవిస్తున్నాయి. ప్రజల జీవనశైలిలో వచ్చిన మార్పులు, మారిన ఆహార అలవాట్లు కేన్సర్ వ్యాధికి ఎక్కువగా కారణమవుతున్నాయి. 2015%–%2019 మధ్య 43 కేన్సర్ రిజిస్ట్రీల్లో నమోదైన గణాంకాలను విశ్లేషించిన ఓ జాతీయ బృందం ఈ ఆందోళనకర వివరాలను బయటపెట్టింది. దీనిప్రకారం 2015%–%2019 మధ్య 7.08 లక్షల కేన్సర్ కేసులు నమోదవగా 2.06 లక్షల మరణాలు సంభవించాయి. ఈ లెక్కన 2024లో దేశవ్యాప్తంగా 15.6 లక్షల కేసులు నమోదై 8.74 లక్షల మరణాలు నమోదై ఉండొచ్చని అంచనా వేసింది.

**మహిళల్లో ఎక్కువ కేసులు**

2012%–%2022 మధ్య జాతీయ కేన్సర్ రిజిస్ట్రీలు పలు ఆసక్తికర అంశాలను తెరపైకి తెచ్చాయి. మహిళల్లో కేన్సర్ కేసులు పురుషుల కంటే ఎక్కువగా నమోదయ్యాయి. ముఖ్యంగా బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ కేన్సర్ బాధితులు మహిళల్లో ఎక్కువగా ఉన్నారు. కానీ ఆశ్చర్యకరంగా మహిళల్లో ఈ కేన్సర్ల కారణంగా మరణాల రేటు తక్కువగా ఉంది. మొత్తం కేసుల్లో మహిళల వాటా 51.1 శాతం. కానీ మరణాల రేటు మాత్రం 45 శాతమే. దీనికి ప్రధాన కారణం మహిళల్లో ఎక్కువగా వచ్చే బ్రెస్ట్, సర్వైకల్ కేన్సర్లు. ఇవి స్క్రీనింగ్ ద్వారా ముందే గుర్తించే వీలుండటంతోపాటు ముందస్తుచికిత్సలతో మెరుగైన ఫలితాలు వస్తున్నాయి. మరోవైపు పురుషుల్లో వచ్చే ఓరల్, లంగ్, లివర్, ఉదర, అన్నవాహిక కేన్సర్లు ఆల స్యంగా నిర్ధారణ కావడంతో మరణాలు అధికంగా నమోదవుతు న్నాయని ఐసీఎంఆర్%–%ఎన్‌సీడీఐఆర్ డైరెక్టర్ ప్రశాంత్ మాథుర్ తెలిపారు.

**పొగాకును నియంత్రించకుంటే మరణాలు తగ్గవు..**

ఈ కేన్సర్‌పై పోరులో పురుషుల ప్రవర్తననే పెద్ద శత్రువుగా చూడాలి. పొగాకు నియంత్రణలో కఠిన చట్టాలు అమలు చేయకపోతే మరణాలు తగ్గవు. గ్లోబల్ అడల్ట్ టొబాకో సర్వే ప్రకారం 2009%–%10లో 34.6% ఉన్న పొగాకు వినియోగం 2016%–%17 నాటికి 28.6%కి తగ్గింది. అయినా కేసులు పెరగడానికి పొగాకు దుష్ప్రభావాలకు 20 ఏళ్ల తర్వాత బయటపడే గుణం ఉండటమే కారణం. అధిక మద్యపానం కూడా నోటి కేన్సర్ భారాన్ని పెంచుతోంది. మద్యం, పొగాకు రెండూ విడిగా కేన్సర్ ప్రమాదాన్ని పెంచుతాయి. ఇక కలిపి వాడితే మరింత ప్రమాదం పెరుగుతుంది. %–% డాక్టర్ ప్రశాంత్ మాథూర్

**మరణాలకు కారణం అలవాట్లే..**

‘ పురుషుల్లో ఊపిరితిత్తుల కేన్సర్ కంటే నోటి కేన్సర్ కేసులు ఎక్కువగా నమో దు అవుతున్నాయి. అందుకు ప్రధాన కారణం గుట్కా, జర్దా, బీడీ, సిగరెట్, పొగాకు విని యోగం అలవాట్లేనని అధ్యయనం పేర్కొంది. అలాగే కేన్సర్ లక్షణాలను పురుషులు ఎక్కువగా నిర్లక్ష్యం చేస్తుండటం వల్ల చికిత్స మొదలుపెట్టే సరికే వ్యాధి మూడు లేదా నాలుగో దశకు చేరుకుంటోందని తెలిపింది. దీంతో చికిత్సలు ఫలితం ఇవ్వడంలేదని అధ్య యనం వివరించింది.

**పర్యావరణం, జీవనశైలి ప్రభావం**

‘ అయితే దేశమంతా కేన్సర్ కేసుల తీరు భిన్నంగా ఉంటోంది. ఈశాన్య రాష్ట్రం మిజోరాం (ఐజ్వాల్)లోని పురుషుల్లో ప్రతి లక్ష మంది పురుషుల్లో 269.4 కేన్సర్ కేసులు, అరుణా చల్‌ప్రదేశ్ (పపుంపారే) లోని ప్రతి లక్ష మంది మహిళల్లో 227.5 కేన్సర్ కేసులు నమోదవుతుండగా మహారాష్ట్రలోని బర్షీలో మాత్రం అతితక్కువ కేన్సర్ కేసులు నమోదైనట్లు అధ్యయనం గుర్తించింది. వాయు కాలు ష్యం, ఆహార అలవాట్లు, జన్యు కారణాలు మొదలైన అంశాల వల్ల ప్రాంతాలవారీ వ్యత్యాసం కనిపిస్తోందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

**ప్రాంతాలవారీగా కేన్సర్ కేసుల తీరు: (ప్రతి లక్ష జనాభాకు)**

హైదరాబాద్: బ్రెస్ట్ కేన్సర్ అత్యధికం (54)
ఐజ్వాల్: సర్వైకల్ కేన్సర్ అత్యధికం (27.1)
శ్రీనగర్: పురుషుల్లో లంగ్ కేన్సర్ అత్యధికం (39.5)
ఐజ్వాల్ మహిళలు: లంగ్ కేన్సర్ అత్యధికం (33.7)
అహ్మదాబాద్: పురుషుల్లో ఓరల్ కేన్సర్ అత్యధికం (33.6)
శ్రీనగర్: ప్రోస్టేట్ కేన్సర్ అత్యధికం (12.7)
ఈస్ట్ ఖాసీ హిల్స్: మహిళల్లో ఓరల్ కేన్సర్ అత్యధికం (13.6)

# చైనా ఆయుధ పాటవం

బీజింగ్, సియోల్



రక్షణ రంగ దిగ్గజాల్లో ఒకటైన చైనా బుధవారం తన ఆయుధ పాటవాన్ని ప్రదర్శించనుంది. రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్‌పై తాము సాధించిన విజయానికి 80 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని దీనిని ఏర్పాటు చేసింది. అధునాతన యుద్ధ విమానాలు, క్షిపణులు, ఎలక్ట్రానిక్ జామింగ్ వంటి హార్డ్‌వేర్ వ్యవస్థల్ని తొలిసారి ప్రపంచం ముందు ప్రదర్శించబోతోంది. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఉత్తర కొరియా అధినేత కిమ్‌జోంగ్ ఉన్ సహా 26 దేశాల అగ్రనేతలు దీనికి హాజరవుతుండడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రతిష్ఠాత్మక తియానన్మేన్ స్క్వేర్ వద్ద జరిగే కార్యక్రమంలో జిన్‌పింగ్ ప్రసంగించనున్నారు. అమెరికాకు ఏమాత్రం తీసిపోని అనేక ఆయుధాలను చైనా సైన్యం ప్రదర్శించనుంది. వీటిలో నాలుగో తరం యుద్ధ ట్యాంకులు, అత్యాధునిక విమానాలు, హైపర్‌సోనిక్ క్షిపణులు వంటివి ఉంటాయి. అమెరికా తన బలాన్ని చాటేందుకు జూన్‌లో ఇలాంటి ప్రయత్నమే చేసింది.

**పుతిన్ నా పాత మిత్రుడే: జిన్‌పింగ్**

పుతిన్ మంగళవారం జిన్‌పింగ్‌తో భేటీ అయ్యారు. ఆయన్ని తన పాత మిత్రుడుగా జిన్‌పింగ్ పేర్కొని సాదరంగా స్వాగతించారు. షీ తన ప్రియమిత్రుడు అని పుతిన్ చెప్పారు. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం మొదలైనప్పటి నుంచి చైనా–రష్యా బంధం బలపడుతూ వస్తోంది. 30 రోజుల చెల్లుబాటుతో.. వీసా అవసరం లేకుండా చైనాలోకి వచ్చేందుకు రష్యా పర్యాటకులను ఈ నెల నుంచే అనుమతించాలని తాజా సమావేశంలో నిర్ణయం కుదిరింది. గ్యాస్ సరఫరాపైనా ఒప్పందాలు ఖరారయ్యాయి.

**జిన్‌పింగ్‌తో షెహబాజ్, మునీర్ భేటీ**

ఫీల్డ్ మార్షల్‌గా బాధ్యతలు తీసుకున్న పాకిస్థాన్ సైన్యాధిపతి ఆసిం మునీర్ మంగళవారం జిన్‌పింగ్‌తో తొలిసారి భేటీ అయ్యారు. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కూడా పాల్గొన్నారు.

**బుల్లెట్ ప్రూఫ్ రైలులో కిమ్**

ఉత్తర కొరియా అధినేత కింగ్‌జోంగ్ ఉన్ బుల్లెట్ ప్రూఫ్ రైలులో బీజింగ్ చేరుకున్నారు. 2023 తర్వాత ఆయన దేశం దాటడం ఇదే తొలిసారి. అమెరికా, దాని మిత్ర దేశాల ఆంక్షలతో ఉక్కిరిబిక్కిరి అవుతోన్న ఉత్తర కొరియాకు చైనా నుంచి పూర్తి మద్దతు అందుతోంది. రష్యాకు ఉత్తర కొరియా తన సైనికులను పంపుతోంది. ఇప్పుడు ఈ మూడు దేశాధినేతలు ఒక వేదిక వద్ద కనిపించనుండటం వారి మధ్య బలపడుతోన్న బంధానికి నిదర్శనంగా నిలవనుంది. పుతిన్, కిమ్‌లను తమవైపు ఆకట్టుకునేందుకు అమెరికా చేస్తున్న ప్రయత్నాలకు గండికొట్టేలా ముగ్గురినీ ఒక్కచోటకు చేర్చడం చైనా వ్యూహంగా చెబుతున్నారు. ఈ ప్రదర్శనకు హాజరు కావద్దని ప్రపంచ నేతల్ని జపాన్ కోరింది.

# కోతుల బెడదతో శివన్నగూడెం ప్రజలు భయబ్రాంతులు

సంబంధిత అధికారులు వెంటనే కోతుల బెడద నుండి విముక్తి కల్పించాలని గ్రామస్తులు ఆవేదన

**మర్రిగూడెం ప్రభాతసూర్య 2** నల్గొండ జిల్లా మర్రిగూడ మండలం శివన్నగూడెం గ్రామంలో కోతుల బెడదతో గ్రామ ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. వివరాల్లోకి వెళ్తే, శివన్నగూడెం గ్రామానికి చెందిన బల్లెం రామస్వామి కుమారుడు బల్లెం రాంచరణ్ (8వ తరగతి విద్యార్థి) ఆరుట్ల హాస్టల్‌లో చదువుకుంటున్నాడు. వినాయక పూజా కార్యక్రమం నిమిత్తం ఇంటికి వచ్చిన రాంచరణ్, పూజా కార్యక్రమానికి వినాయకుడికి నైవిద్యం తీసుక వెళ్తున్న సమయంలో కోతులు



అకస్మాత్తుగా దాడి చేశాయి. ఈ ఘటనలో రాంచరణ్ గాయపడటంతో వెంటనే మర్రిగూడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటన ఒక్కరిపై మాత్రమే కాదు,



గ్రామమంతటా కోతులు అడ్డదిడ్డంగా తిరుగుతూ ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతుల హింసతో చిన్నారులు, వృద్ధులు ఇంటి బయటకు రావడానికి భయపడుతున్న పరిస్థితి నెలకొంది. దీనిపై సంబంధిత అటవీ శాఖ అధికారులు, ప్రభుత్వ యంత్రాంగం తక్షణ చర్యలు తీసుకొని కోతుల బెడదను అరికట్టాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# గల్లీకా గణేష్ ఆధ్వర్యంలో లక్ష్మీ గణపతి పూజ మరియు అన్నదాన కార్యక్రమం

**మాదాపూర్ ప్రభాత సూర్య :** మాదాపూర్ డివిజన్ పరిదిలో లో నీ గుట్టల బేగంపేట్ లో నీ గల్లీ కా గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా లక్ష్మీ గణపతి హెూమం మరియు అన్నదాన కార్యక్రమం జరిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్సైలు బాలరామ్,కాలే వెంకటేశ్వర్లు, భక్తులకు వడ్డించారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ గల్లీ కా గణేష్ యూత్ అసోసియేషన్ ప్రతి ఒక్కరూ దైవచింతను అలవర్చుకోవాలి ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గల్లీ క గణేష్



యూత్ అసోసియేషన్ సభ్యులు తదితరాలు పాల్గొన్నారు.

# కవితపై చర్యలు తప్పవా

**హైదరాబాద్ :** కల్వకుంట్ల కవిత మరోసారి బీఆర్ఎస్ పై బాణం ఎక్కుపెట్టారు. అయితే ఈసారి నేరుగా పేర్లు బయటపెడుతూ విమర్శలు చేయడంతో పార్టీ రాజకీయంగా ఇబ్బందుల్లో పడినట్లయింది. కాళేశ్వరం కమిషన్ నివేదికపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పందించారు. ఈసారి నేరుగా హరీశ్ రావును లక్ష్యంగా చేసుకుని ఆమె మీడియా సమావేశంలో సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇద్దరు, ముగ్గురు నేతలు కలసి కేసీఆర్ పై కుట్రలకు పాల్పడ్డారని కల్వకుంట్ల కవిత అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో హరీశ్ రావు, సంతోష్ రావుది కీలక పాత్ర అని ఆమె చెప్పారు. వీరిద్దరి వెనక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారని, వారిని కాపాడుతున్నది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని చెప్పారు. తాను ఇప్పుడు మాట్లాడితే తన వెనక ఎవరో ఉన్నారంటారని, కానీ ఆ అవినీతి అనకొండల మధ్య కేసీఆర్ బలిపశువుగా మారారని కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. తనపై సోషల్ మీడియా లో తప్పుడు ప్రచారాలు చేస్తున్నదీ వారేనని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలకు బాధ్యుడిని చేస్తూ కేసీఆర్ పై సీబీఐ విచారణ చేసిందని, తన కడుపు మండిపోతుందని ఆమె ఆవేదన చెందారు. తన తండ్రికి డబ్బు, తిండిపై ఏనాడూ ఆశ లేదని, కేసీఆర్ పరువు పోతే ఆ బాధ తమకు ఉంటుందని చెప్పుకొచ్చారు కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిలో హరీశ్ రావుది కీలక పాత్ర అని అన్నారు. అందుకే నాడు హరీశ్ రావు ను నాడు నీటిపారుదల శాఖ మంత్రిగా తొలగించారని చెప్పారు. తనను అడ్డుకుంటే బిడ్డా ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. హరీశ్ రావు, సంతోష్ రావు వల్లే తమ పార్టీ అధినేత కేసీఆర్ కు ఈ పరిస్థితి దాపురించిందని ఆమె ఆవేదన చెందారు. కేసీఆర్ ను అడ్డంపెట్టుకుని వీళ్లిద్దరూ భారీగా ఆస్తులు కూడబెట్టారన్న కవిత, వారిద్దరికీ డబ్బులు మాత్రమే కావాలని ఆవేదన చెందారు. అయితే దీనిపై బీఆర్ఎస్ పార్టీ వెంటనే ఎక్స్ లో స్పందించింది. హరీశ్రావును ఆరడుగుల బుల్లెట్ అంటూ బీఆర్ఎస్ సోషల్ మీడియాలో పేర్కొంది. కవిత కామెంట్స్ తర్వాత ఎర్రవెల్లి ఫామ్ హౌస్ కు బీఆర్ఎస్ నేతలు బయలుదేరి వెళ్లారు. కేటీఆర్ తో పాటు మధుసూదనాచారి, వేముల ప్రశాంత్ రెడ్డి, జగదశ్వర్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి కేసీఆర్ తో సమావేశమై కవిత వ్యాఖ్యలపై చర్చిస్తున్నారు. కవితపై ఇక చర్యలకు దిగే అవకాశముందని తెలిసింది.


**బావతోనే యుద్ధం**



కవిత చేస్తున్న వ్యాఖ్యలు పెను దుమారం రేపుతున్నాయి. తాజాగా తన బావ, మాజీ మంత్రి, సొంతపార్టీలో అత్యంత కీలకనేత హరీష్ రావు పైనే తీవ్ర ఆరోపణలు చేసి పొలిటికల్ హీట్ పీక్స్ కు తీసుకెళ్లారు. అంతేకాదు ఎంపీ సంతోష్ పై కూడా తీవ్ర స్దాయిలో విరుచుకుపడ్డారు కవిత. కాలేశ్వరం నిర్మాణంలో హరీష్ రావు అవినీతికి పా?ల్పడలేదా.. అంటూ విమర్శలు మొదలు పెట్టిన కవిత సంతోష్ ,హరీష్ రావు ఇద్దరూ కలసి తన తండ్రి కేసీఆర్ పై అవినీతి మరకలు అంటించే ప్రయత్నం చేస్తున్నారని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అంతేకాదు మరో అడుగు ముందుకేసి వీరిద్దరి వెనుక సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారంటూ రెచ్చిపోయారు. బీఆర్ ఎస్ మాజీ మంత్రి హరీష్ రావు, ఎంపీ సంతోష్ పార్టీలో కీలక నేతలు, కేసీఆర్ కు అత్యంత సన్నిహితులు. హరీష్ రావు అయితే ఇంక చెప్పక్కర్లేదు. పార్టీలో కేసీఆర్ తరువాత కీలక నిర్ణయాలు తీసుకునేది కేటీఆర్, హరీష్ లే. మరి అంతలా పార్టీకి విధేయతగా ఉండే హరీష్ రావుపై కవిత చేసిన వ్యాఖ్యలు సొంత పార్టీలోనే కాదు, తెలంగాణ రాజకీయాల్లో పొలిటికల్ తుఫాన్ కు కారణమైయ్యాయి. కాలేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై తాజాగా సిబిఐ ఎంక్వరీకి సిఫార్సు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. దీనిపై మీడి?యా సమావేశం ఏర్పాటు చేసిన కవిత, బిఆర్ ఎస్ కు మద్దతుగా మాట్లడుతారని అంతా అనుకున్నారు. టార్గెట్ కాంగ్రెస్ గా ఆమె ప్రసంగం ఉంటుం దని ఊహించారు. కానీ అందరి లెక్కలు తలకిందులైయ్యేలా సొంత పార్టీ బీఆర్ ఎస్ పై , నేరుగా బావ హరీష్ రావులనే విమర్శలతో ఢీ కొట్టింది కవిత.గతంలో బీఆర్ ఎస్ లో నెలకొన్న అసంతృప్తిపై కేసీఆర్ కు కవిత రాసిన లేఖతో మొదలై చిచ్చు, తాజాగా హరీష్ రావు,సంతోష్ పై చేసిన విమర్శలతో అగ్నిపర్వతం బద్దలైనట్లుగా సెగలు పుట్టిస్తోంది. తన తండ్రికి లేఖ, లీక్ తరువాత మీడియాతో మాట్లడిన కవిత బిఆర్ఎస్‌లో తన తండ్రి కేసీఆర్ దేవుడని, ఆయన చుట్టూ కొన్ని దెయ్యాలున్నాయని, ఆ దెయ్యాల వల్ల పార్టీ నష్టపోతోందని గతంలో సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ తరువా?త అనేకసార్లు నేరుగా పార్టీపై విమర్శలు చేసినప్పటికీ ఒక్క జగదీష్ రెడ్డి ప్రస్తావన తప్ప, బీఆర్ ఎస్ లో ఎవరినీ పేర్లు చెప్పలేదు. నేరుగా పేర్లు ప్రస్తావించి తీవ్ర స్దాయిలో విమర్శించలేదు. తాజాగా కవిత మాట్లడుతూ హరీష్ ,సంతోష్ వారి స్వార్థం కోసం తన తండ్రిని వాడుకున్నారని, ఇప్పుడు సిబిఐ ఎంక్వరీ వరకూ పరిస్దితి తీసుకొచ్చారని విరుచుకు పడ్డారు. కవిత తాజాగా విమర్శల నేపధ్యంలో బిఆర్ ఎస్ లో విభేదాలు పీక్స్ చేరుకున్నాయని క్లారిటీ వచ్చినట్లయ్యింది. అంతేకాదు సొంత బావ హరీష్ రావుతో ఇకపై డైరెక్ట్ పొలిటికల్ వా?ర్ కు తాను సిద్దంగా ఉన్నాననే సంకేతాలిచ్చినట్లుగా తెలుస్తోంది. ఈరోజు వరకూ కేటీఆర్ కు కవితకు మధ్య చెడిందని, కేటీఆర్ పై కక్షతోనే ఇలా మాట్లడుతోందనే ఊహాగానాలకు చెక్ పెట్టేలా తెరపైకి హరీష్ పేరు తెచ్చి, నా కక్ష అన్నపై కాదు బావపై అన్నట్లుగా కవిత వ్యాఖ్యలతో ఓ క్లారిటీ వచ్చిందనే టాక్ వినిపిస్తోంది. కవిత వ్యాఖ్యలు తరువాత బీఆర్ ఎస్ లో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. కేసీఆర్ పై సిబిఐ ఎంక్వరీ వేసిన తరువాత బిఆర్ ఎస్ పార్టీ ఉంటే ఎంత , పోతే ఎంత.. అంటూ కవిత అన్న మాటలు ఏకంగా పార్టీనేతల్లో తీవ్ర ఆగ్రహనికి కారణమైనట్లు తెలుస్తోంది. కవిత వర్సెస్ హరీష్ రావు వివాదంలో పార్టీ మద్దతు హరీష్ కే నంటూ బిఆర్ ఎస్ సోషల్ మీడియా పోస్టుల ద్వారా క్లారిటీ ఇస్తోంది. ఇదిలా ఉంటే కాలేశ్వరం పై సిబిఐ అంటూ కాంగ్రెస్ పా?ర్టీ ఇచ్చిన ఊహించని షాక్ లో ఉన్న బిఆర్ ఎస్ నేతలకు అంతకు మించి అన్నట్లుగా తాజాగా కవిత చేసిన విమర్శలపై హరీష్ రావు, సంతోష్ లు ఎలా స్పందిస్తారో చూడాలి.

# మంత్రిగా మహ్మద్ అజారుద్దీన్

**హైదరాబాద్ :** టీమిండియా మాజీ కెప్టెన్, కాంగ్రెస్ నేత మహ్మద్ అజారుద్దీన్ తెలంగాణలో గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అవుతున్నారు. తెలంగాణ కేబినెట్ ప్రొఫెసర్ కోదండరాం, అజారుద్దీన్ పేర్లను గవర్నర్‌కు సిఫారసు చేసింది. గవర్నర్ కోటా కింద అజారుద్దీన్ ను శాసనమండలి కి నామినేట్ చేయాలని నిర్ణయించడంతో మంత్రి పదవి ఖాయమని చర్చ ఊపందుకుంది. కొన్ని వారాల కిందట తాను జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తానని అజారుద్దీన్ ప్రకటించడంతో పార్టీ నేతలు సైతం ఆశ్చర్యపోయారు. ఆయనకు అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్సీ చేస్తోంది కాంగ్రెస్ ప్రభుత్వం.2023 అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఓడిపోయిన తర్వాత ఆయన మరోసారి బరిలోకి దిగేందుకు సిద్ధమయ్యారు. వాస్తవానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో ఈ సీటు ఖాళీ అయింది. దాంతో తాను మళ్లీ పోటీ చేస్తానని, అధిష్టానం తనకే సీటు ఇస్తుందని అజారుద్దీన్ పేర్కొన్నారు. ఢిల్లీకి వెళ్లి సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను సైతం అజారుద్దీన్ కలిసి చర్చించడం కలిసొచ్చింది. ఎమ్మెల్సీ పదవికి



నామినేట్ కావడంపై తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ అజారుద్దీన్ హర్షం వ్యక్తం చేశారు. అజారుద్దీన్ సోషల్ మీడియా ఎక్స్ లో ఇలా రాసుకొచ్చారు. "తెలంగాణ లో గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీ పదవికి నామినేట్ చేయాలన్న కేబినెట్ నిర్ణయాన్ని నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను. తనపై నమ్మకం ఉంచిన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సోనియా గాంధీ, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కె.సి. వేణుగోపాల్ లకు హృదయపూర్వక ధన్యవాదాలు" తెలిపారు. అదే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలకు కూడా ధన్యవాదాలు తెలిపారు. "నేను పార్టీకి నిజాయితీగా, అంకితభావంతో ప్రజలకు సేవ చేయడానికి కట్టుబడి ఉన్నాను" అని అజారుద్దీన్ రాసుకొచ్చారు.ఐఏఎన్ఎ స్ఓ నివేదికలో అజారుద్దీన్ ఎమ్మెల్సీగా నామినేట్ అవ్వడం ద్వారా రాష్ట్ర మంత్రివర్గంలో చేరేందుకు ఆయనకు మార్గం సుగమం అవుతుందని పేర్కొంది.

**తెలంగాణలో ఎంతమంది మంత్రులు ఉన్నారు**

ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి సహా 14 మంది మంత్రులు తెలంగాణ ప్రభుత్వంలో ఉన్నారు. ఇంకా ముగ్గురికి మంత్రి పదవి ఇచ్చే అవకాశం ఉంది. తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యే ముందు మహ్మద్ అజారుద్దీన్ ఉత్తరప్రదేశ్ లోని మొరాదాబాద్ నుంచి ఎంపీగా (2009-2014) చేశారు. 2019లో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ 27వ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. కాగా, 62 ఏళ్ల మహ్మద్ అజారుద్దీన్ భారత్ తరఫున 99 టెస్టులు, 334 వన్డే మ్యాచ్‌లలో ప్రాతినిథ్యం వహించారు. ఆయన టెస్టుల్లో 6215 పరుగులు, వన్డేల్లో 9378 పరుగులు చేశారు

## గణాధ్యక్షునికి ఘనంగా పూజలు నిర్వహించిన రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి



**కూకట్ పల్లి, సెప్టెంబర్ 02 (ప్రభాత సూర్య) :** శేర్లింగంపల్లి నియోజకవర్గం, వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయకునికి రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సోమవారం రాత్రి ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ ప్రత్యేక పూజా కార్యక్రమానికి గొట్టుముక్కుల పెద్ద భాస్కర రావు ముఖ్యఅతిథిగా హాజరై వినాయక మహారాజుకు పూలమాలవేసి స్వామివారిని సేవించుకున్నారు. ఈ కార్యక్రమంలో రామారావు, జి ప్రసాద్, సుధాకర్, వెంకటేశ్వరరావు, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాసరావు, గణేష్, యూత్ కమిటీ సభ్యులు అశ్విత్, నందు, రిత్విక్, అనిల్, భార్గవ్ సాయి తదితరులు పాల్గొన్నారు.

## గణనాథునికి ఘనంగా పూజలు నిర్వహించిన ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి



**బాలానగర్, సెప్టెంబర్ (ప్రభాత సూర్య) :**వినాయక నవరాత్రుల్లో భాగంగా కూకట్ పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధిలోని వివిధ బస్తీలలో ఏర్పాటుచేసిన వినాయక మండపాలను ఏ బ్లాక్ ఉపాధ్యక్షులు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాలలో పాల్గొని ప్రారంభించారు.

## శివన్నగూడెం పెద్దమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం




**మర్రిగూడ ప్రభాతసూర్య 2** నల్గొండ జిల్లా మర్రిగూడ మండలం శివన్నగూడెం గ్రామంలో పెద్దమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. పెద్దమ్మ ఆలయం వినాయకుని ప్రాంగణంలో జరిగిన ఈ అన్నదాన కార్యక్రమానికి గ్రామ ప్రజలు, యువకులు, మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. భక్తి శ్రద్ధలతో అన్నదాన కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో పెద్దమ్మ ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక కృషి చేశారు.

## గణేష్ నిమజ్జనంలో డీజే వాడకూడదు గట్టుప్పల్ ఎస్సై ఏం సంజీవరెడ్డి హెచ్చరిక




**గట్టుప్పల్ ప్రభాత సూర్య 2** గణేష్ నిమజ్జనం సందర్భంగా డీజేల వినియోగంపై గట్టుప్పల్ ఎస్సై ఏం సంజీవరెడ్డి కఠిన హెచ్చరికలు జారీ చేశారు. ఆయన మాట్లాడుతూ "అనుమతి లేకుండా ఎవరైనా డీజే వాడితే కఠినమైన చర్యలు తీసుకుంటాం. భక్తి కార్యక్రమాన్ని శాంతియుతంగా, సాంప్రదాయబద్ధంగా నిర్వహించాలి. ఆచారాలకు భంగం కలిగించే విధంగా డీజేలు, అధిక శబ్దం, హంగామాలు అసలు ఉండకూడదు" అని స్పష్టం చేశారు. నిమజ్జన శోభాయాత్రలు పోలీసు పర్యవేక్షణలో మాత్రమే జరగాలి. ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసిన ఉత్సవ కమిటీలు ముందుగానే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. డీజేలు, అధిక శబ్ద పరికరాలు వాడితే వెంటనే స్వాధీనం చేసుకుంటామని, బాధ్యులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## గల్లీకా గణేష్ ఆధ్వర్యంలో లక్ష్మీ గణపతి పూజ మరియు అన్నదాన కార్యక్రమం.....



**మాదాపూర్ ప్రభాత సూర్య :** మాదాపూర్ డివిజన్ పరిదిలో లో నీ గుట్టల బేగంపేట్ లో నీ గల్లీ కా గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా లక్ష్మీ గణపతి హెూమం మరియు అన్నదాన కార్యక్రమం జరిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, బిక్షపతి ముదిరాజ్ లు పాల్గొని ఆ గణనాథున్ని దర్శించి అన్నప్రసాదాలు, తీర్థ ప్రసాదాలు భక్తులకు వడ్డించారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ గల్లీ కా గణేష్ యూత్ అసోసియేషన్ ప్రతి ఒక్కరూ దైవచింతను అలవర్చుకోవాలి ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గల్లీ క గణేష్ యూత్ అసోసియేషన్ సభ్యులు తదితరాలు పాల్గొన్నారు.

# గట్టుప్పల మండలంలో కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

**గట్టుప్పల్ ప్రభాతసూర్య 2**
నల్గొండ జిల్లా గట్టుప్పల మండలం నామాపురం గ్రామానికి చెందిన మూడు లబ్ధిదారులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల తహసిల్దార్ కె. రాములు హాజరై, లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా నామాపురం గ్రామానికి చెందిన గుండెభోయిన సంధ్య, గుండెభోయిన మమతా, వీరమల్ల మౌనికలకు ఒక్కొక్కరికి రూ.1,00,116 విలువైన కళ్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో మాట్లాడిన గట్టుప్పల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నామని జగన్నాథం మాట్లాడుతూ, పేద ప్రజల సంక్షేమార్థం రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని, వాటిలో కళ్యాణలక్ష్మి పథకం పేద కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉందని పేర్కొన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు తెలంగాణ ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పట్ల కృతజ్ఞతలు తెలిపారు. కళ్యాణలక్ష్మి



పథకం ద్వారా పేద ప్రజలకు మేలు జరుగుతోందని వారు ప్రభుత్వాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షులు సామల యాదయ్య, తెరటుపల్లి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు గిరి సత్తయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నామని బుచ్చయ్య, కంచుకట్ల సంపత్, రావుల రమేష్, యాదయ్య, పగుళ్ల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా స్కూల్ గేమ్స్ పెడరేషన్ క్రీడలు

**ముఖ్య అతిధులుగా హాజరై కొబ్బరి కాయ కొట్టి రిబ్బన్ కట్ చేసి క్రీడలను ప్రారంభించిన తహసీల్దార్ శ్రీనివాసులు మరియు మాజీ జెడ్ పి టి సి. పాశం సురేందర్ రెడ్డి**

**క్రీడలలో గెలుపొందిన విద్యార్థులకు తన సొంత ఖర్చులతో 210 మందికి బహుమతులు ప్రధానం చేసిన మాజీ జెడ్ పి టి సి పాశం సురేందర్ రెడ్డి**

**మర్రిగూడ సెప్టెంబర్ 2 ప్రభాత సూర్య** ?? స్కూల్ గేమ్స్ పెడరేషన్ ఆధ్వర్యంలో మర్రిగూడ మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మండల స్థాయి క్రీడలు ఘనంగా జరిగాయి ఈ కార్యక్రమానికి మంగళవారం ముఖ్య అతిధిలుగా మండల తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు మరియు మాజీ నల్గొండ జిల్లా ఫైనాన్స్ కమిటీ మెంబర్ జెడ్ పి టి సి పాశం సురేందర్ రెడ్డి లు హాజరయ్యారు ఈ సందర్బంగా వారు కొబ్బరి కాయ కొట్టి రిబ్బన్ కట్ చేసి క్రీడలను ప్రారంభించారు ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడల వల్ల శరీర దారుఢ్యత పెరుగుతున్నదని,మంచి క్రమశిక్షణ వస్తుందని ఆరోగ్యం మెరుగుడుపడుతుందని మానసిక ప్రశాంతత కలుగుతుందని, గెలువాలనే పట్టుదల పెరుగుతుందని అన్నారు, విద్య తో



పాటు క్రీడాలలోను రానించాలని అన్నారు ఈ ఆటల పూర్తి సామాగ్రి బహుమతులను తన సొంత ఖర్చులతో పాశం సురేందర్రెడ్డి అందచేశారు మండల ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతం కోసం నా పూర్తి సహకారం ఉంటుందని పాశం సురేందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం లో మండలంలో ఉన్న ఎనిమిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు రెండు ప్రాథమికొన్నత పాఠశాల ల విద్యార్థులు ఆటల పోటీలలో పాల్గొన్నారు ఈ కార్యక్రమం లో విద్యార్థి ఉద్యమ నాయకుడు మాజీ ఎంపీటీసీ సిలివేరు విష్ణు, పందుల పాండు గౌడ్,



రాజపేట తండా మాజీ సర్పంచ్ బిచ్చు నాయక్, మాజీ మోడల్ స్కూల్ చైర్మెన్ కృష్ణ, జావెద్, మాదగోని లింగయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పిజికల్ డైరెక్టర్ వేదావతి, ఉపాధ్యాయులు మాస బాలరాజు, జంగయ్య, హనుమంత్, కృష్ణారెడ్డి, వాసుదేవరావు, అన్ని పాఠశాల ల పి, డి లు మరియు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు చేయాలి

**-డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పల్లె మధు కృష్ణ**

**చౌటుప్పల్. సెప్టెంబర్ 2. ప్రభాత సూర్య :** గ్రామ పంచాయతీలకు తక్షణమే నిధులు మంజూరు చేయటంతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పల్లె మధు కృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చౌటుప్పల్ మండలం,జై కేసారం గ్రామంలో మంగళవారం డివైఎఫ్ఐ పల్లె పల్లెనా పోరుబాట కార్యక్రమంలో పాల్గొని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పల్లె మధు కృష్ణ పాల్గొని మాట్లాడుతూ... గ్రామపంచాయతీలో నిధులు లేకపోవడంతో గ్రామాలు అభివృద్ధికి నోచుకోక అస్తవ్యస్తంగా ఉన్నాయని, సమస్యలకు నిలయాలుగా మారాయని అన్నారు. మరోవైపు కుక్కలు,కోతుల బెడదతో వయోవృద్ధులు, చిన్నపిల్లలు భయభ్రాంతులకు గురవుతున్నారని అన్నారు. ఎల్లంకి ఎక్స్ రోడ్డు నుండి నేలపట్ల వరకు బిటి రోడ్డు ఏర్పాటు చేయాలని అన్నారు. అసంపూర్తిగా ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సిసి రోడ్లను పూర్తిచేయాలని అన్నారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశం ఉందని గ్రామపంచయితీ సిబ్బందితో గ్రామాన్ని శుభ్రంగా చేయించాలని అన్నారు. పాలక వర్గాలు లేకపోవడంతో పరిపాలన వ్యవస్థ పడకేసిందని అన్నారు. స్థానిక ఎన్నికలు జరిపి గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు చేసి గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలని అన్నారు. గ్రామ సమస్యలపై గ్రామపంచాయతీ కార్యదర్శికి పల్లె మధు కృష్ణ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ మండల కార్యదర్శి గుడ్డేటి సుజిత్, మండల ఉపాధ్యక్షులు పల్లె శివకుమార్, డివైఎఫ్ఐ గ్రామ అధ్యక్ష



కార్యదర్శులు పాలమాకుల రాకేష్, వనం విజయ్ కుమార్, నాయకులు బోడిగే సైదులు, గంగాదేవి లింగస్వామి, మాడగౌని మారయ్య, బోయ పృధ్వి తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాన భాగ్యం పూర్వజన్మ సుకృతం

**-నేతాజీ యూత్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ...**

**-చౌటుప్పల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులు బత్తుల విప్లవ్ కుమార్ గౌడ్**

**చౌటుప్పల్. సెప్టెంబర్ 2. ప్రభాత సూర్య :** అన్నదానంలో భాగస్వామ్యులయ్యే అవకాశం కలగడం పూర్వ జన్మ సుకృతమని, మానవ సేవను మించిన సేవ మరొకటి లేదని చౌటుప్పల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులు బత్తుల విప్లవ్ కుమార్ గౌడ్ అన్నారు. మంగళవారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని తంగడ పల్లి రోడ్డులో నేతాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన గణనాథుడి వద్ద ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ యూత్ అసోసియేషన్ నిర్వాహకులు వారికి ఘన స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా బత్తుల విప్లవ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. గణపతి ఉత్సవ కార్యక్రమాలు, అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలలో పాలుపంచుకోవడం సంతోషంగా



ఉందన్నారు. ఆధ్యాత్మిక భావంతో మానసిక శక్తి సిద్ధించడంతోపాటు సేవా దృక్పథం అలవడుతుందని పట్టణ కేంద్రంలో స్నేహపూర్వక వాతావరణం నెలకొంటుందన్నారు. వినాయక చవితి నవరాత్రులు ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో జరుపుకుంటూ లోక క్షేమం కోసం పూజలు, అన్నదానాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఆ గణనాథుడి ఆశీస్సులతో మున్సిపాలిటీ ప్రజలందరూ సుఖసంతోషాలు ఆయురారోగ్యాలతో కలకాలం వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఎంసీ చైర్మన్ ఉబ్బు



వెంకటయ్య, మునుగోడు కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్, పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారితోపాటు మాజీ చౌటుప్పల్ మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం గౌడ్, మాజీ కౌన్సిలర్లు సంధగళ్ళ విజయ సతీష్ గౌడ్, గోపగోని లక్ష్మణ్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల, మున్సిపల్ అధ్యక్షులు బోయ దేవేందర్, సుర్వి నర్సింహ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల, మున్సిపల్ అధ్యక్షులు బోయ దేవేందర్, సుర్వి నర్సింహ గౌడ్, మరియు చౌటుప్పల్ పుర ప్రముఖులు, నేతాజీ యూత్ నిర్వాహకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# మునుగోడులో ఘనంగా గణపయ్యకు పూజలు

**మునుగోడు, సెప్టెంబర్ 02(ప్రభాత సూర్య):** మునుగోడు మండల వ్యాప్తంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుపుకుంటున్నారు.మునుగోడు మండల కేంద్రంలో 1 వార్డులో వినాయక యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు..అర్చకులు బొల్లోజు శ్రీకాంత్ చారి పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.. పెరుమాళ్ళ ప్రమోద్ కుమార్,గోలి మారయ్య,పెరుమాళ్ళ యాదగిరి,పెరుమాళ్ళ ప్రణయ్ కుమార్,గాలి జీవన్,బసనగర



రాము,ముచ్చపోతుల పవన్,,చింతపల్లి వంశీ,విఘ్నేశ్వర



కమిటీ సభ్యులు , కాలని వాసులు పాల్గొన్నారు..

## జంపాల తిరుపతయ్య కుటుంబానికి ఆర్థిక సాయం

**మర్రిగూడ ప్రభాతవార్త2**



నల్గొండ జిల్లా మర్రిగూడ మండలం రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన జంపాల తిరుపతయ్య ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆదివారం రాత్రి పురుగుల మందు సేవించి మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ దుర్ఘటనపై విచారం వ్యక్తం చేసిన ఈఎల్వి ఫౌండేషన్ అధినేత భాస్కర్, బాధిత కుటుంబాన్ని ఆదుకోవడానికి ముందుకొచ్చారు. స్థానికంగా సమాచారం అందించిన మర్రిగూడ సాక్షి విలేఖరి ద్వారా విషయం తెలిసిన వెంటనే భాస్కర్, తిరుపతయ్య కుటుంబానికి ?10,000 ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, ఇలాంటి ఆర్థిక సమస్యలతో బాధపడే కుటుంబాలకు తమ వంతు సహాయం అందిస్తామని తెలిపారు. ఆర్థిక సాయం అందజేసిన కార్యక్రమంలో గ్రామస్తులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు

## వై.యస్ రాజశేఖర్ రెడ్డి సేవలు చిరస్మరణీయం

**-చౌటుప్పల్ మున్సిపల్ అధ్యక్షులు సుర్వి నరసింహ గౌడ్**



**చౌటుప్పల్. సెప్టెంబర్ 2. ప్రభాత సూర్య :** చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని రాజీవ్ స్మారక భవనంలో మంగళవారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖయ్యూం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు సుర్వి నరసింహా గౌడ్ లు వైయస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధ్యక్షులు సుర్వినరసింహగౌడ్ మాట్లాడుతూ.... వైయస్సార్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని, ముఖ్యమంత్రిగా ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. తెలుగుజాతి వైయస్సార్ కి రుణపడి ఉంటుందని అన్నారు. వైయస్సార్ ముఖ్యమంత్రిగా ఉండగా ఆరోగ్యశ్రీ, ఫ్లీజ్ రియంబర్స్మెంట్, రైతు రుణమాఫీలు వంటి ఎన్నో పథకాల ద్వారా ప్రజల గుండెల్లో ఇప్పటికి ఆయన బ్రతికే ఉన్నారన్నారు. అటువంటి మహానుభావులు ప్రజల మనసులో స్థిరస్థాయిగా నిలిచిపోతారని ఈ సందర్భంగా ఆయన చేసిన మంచి పనులను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహమ్మద్ గౌస్ ఖాన్, కార్యవర్గ సభ్యులు నల్ల నర్సింహ, మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చెరుకు గౌడ్, మున్సిపల్ ఉపాధ్యక్షులు మాదాని గోపాల్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఊదరి యాదయ్య, ముత్యాల గణేష్, నిమ్మల ప్రభాకర్ గౌడ్, బుచ్చి రాములు పాల్గొన్నారు.

## బడికి దగ్గరగా ఉన్న వైన్ షాపును తరలించాలి

**-ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కి వినతిపత్రం అందజేత**

**-ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు దోనూరి శ్రవణ్**



**చౌటుప్పల్.సెప్టెంబర్ 2. ప్రభాత సూర్య :** చౌటుప్పల్ మండలం, కొయ్యలగూడెం గ్రామంలో బడికి అతి దగ్గరగా ఉన్న వైన్ షాపును తక్షణమే మార్చాలని ఎస్ఎఫ్ఐ చౌటుప్పల్ మండలం ఉపాధ్యక్షులు దోనూరి శ్రవణ్ అన్నారు. ఈ సందర్భంగా భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా దోనూరి శ్రవణ్ మాట్లాడుతూ... కొయ్యలగూడెం గ్రామంలో ఉన్న వైన్స్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ పాఠశాలకు దగ్గరగా ఉన్నటువంటి వైన్స్ మార్చాలని పలుమార్లు ఆర్డిఓ కి వినతి పత్రం అందజేసిన గాని అధికారులు స్పందించ లేదన్నారు. నిత్యం స్కూల్ కు విద్యార్థులు వస్తుంటారని తాగిన మత్తులో ఉన్నవారు విద్యార్థులతో తప్పుగా మాట్లాడుతున్నారని అన్నారు. అందుకే ఆ వైన్స్ మార్చాలని ఎస్ఎఫ్ఐ గా తాము డిమాండ్ చేస్తున్నామన్నారు.లేని యెడల పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ తిగుళ్ళ శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి లావుడియా రాజు, జిల్లా అధ్యక్షులు చింతల శివ, జిల్లా ఉపాధ్యక్షులు వీర్ల రాహుల్, నరేందర్, ఉదయ్, గాయత్రి,శివాని, హిందూ రాణి తదితరులు పాల్గొన్నారు.

## కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డిపై ఫేక్ న్యూస్ ప్రచారం చేస్తున్నారు

**ఆంధ్రజ్యోతి ప్రతికను తలపించేలా "అందజ్యోతి" అనే నకిలీ పేపర్ ను క్రియేట్ చేసి**




**మునుగోడు,సెప్టెంబర్ 02(ప్రభాత సూర్య)**ఆంధ్రజ్యోతి ప్రతికను తలపించేలా "అందజ్యోతి" అనే నకిలీ పేపర్ ను క్రియేట్ చేసి కొంతమంది కావాలనే "కాళేశ్వరంలో అవినీతి లేదు" అనే హెడ్ లైన్ తో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి అనని, ప్రస్తావించని మాటలను తమ ఇష్టానుసారంగా రాస్తూ ఆ అందజ్యోతి పేపర్ క్లిప్పింగ్ లను సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోల్ చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలేశ్వరం ప్రాజెక్టును కమిషన్ల కోసం కట్టిందని మొట్టమొదట అసెంబ్లీ లో ప్రస్తావించిందే కోమటిరెడ్డి పై అనుమానాలు ఉన్నాయని మీడియా ముందు చెప్పిందే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చెప్పారన్నారు. కాలేశ్వరం ప్రాజెక్టు అవినీతిమయంగా మారిందని కేవలం కాంట్రాక్టర్లు, కెసిఆర్ కుటుంబం లబ్ధి కోసమే నిర్మిస్తున్నారని ఎన్నోసార్లు గొంతెత్తి సమాజానికి చాటి చెప్పిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పై అసత్య వార్తా ప్రచారాలను తమ రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటున్నారని త్వరలో వారికి ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి పై పదేపదే సోషల్ మీడియా వేదికల ద్వారా తప్పుడు వార్తలు, నిరాధార వార్తలు ప్రచారం చేస్తున్న తీరును ప్రజలు గమనిస్తున్నారని బిఆర్ఎస్ నాయకులు గుర్తుంచుకోవాలని తెలుపుతున్నారు . సందర్భం వచ్చినప్పుడు ఇలాంటి తప్పుడు వార్తలు నిరాధార వార్తలు రాస్తున్న వారికి ప్రజలే బుద్ధి చెబుతారని కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

-తంగడపల్లి జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలకు 20, వేల రూపాయల చెక్కును అందజేసిన ఆముదాల పరమేశ్

-క్రీడా పోటీలను ప్రారంభించిన మండల విద్యాధికారి ఈ గురువారావు





**చౌటుప్పల్.సెప్టెంబర్ 2. ప్రభాత సూర్య :** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, ప్రముఖ సినీ నటుడు పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా మంగళవారం ఆయన అభిమాన సంఘం ఆధ్వర్యంలో చౌటుప్పల్ పురపాలక పరిధిలోని తంగడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడ పోటీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాధికారి ఈ గురువారావు పాల్గొని ఆటలు పోటీలను ప్రారంభించారు. పాఠశాలలో టేబుల్ టెన్నిస్ కోర్టు ఏర్పాటు కోసం అభిమాన సంఘం నాయకులు ఆముదాల పరమేశ్ రూ. 20 వేల రూపాయల చెక్కును పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి భార్గవి కి అందజేశారు. ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు క్రీడల పోటీలు నిర్వహించి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సంఘం నాయకులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు భార్గవి , ప్రముఖ సాహితీవేత్త బడుగు శ్రీరాములు చేతుల మీదుగా బహుమతులను ప్రధానం చేశారు. ఉత్తమ క్రీడాకారులకు 1000 రూపాయల నగదు పారితోషకం, మెమొంటోళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో అభిమాన సంఘం నాయకులు ఆముదాల పరమేశ్, నందకిషోర్, పర్నే శివారెడ్డి, తోర్పునూరు లింగస్వామి, మర్ల శ్రీశైలం, రెహాన్,పాశం శ్రీకాంత్, జక్కల మహేశ్, సాయి ప్రకాశ్, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ లింగయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

-గణేష్ నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి...

-మున్సిపల్ కమిషనర్ జి వెంకట్రామిరెడ్డి



**చౌటుప్పల్.సెప్టెంబర్ 02. ప్రభాత సూర్య :** యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కె,హనుమంతు రావు ఆదేశానుసారం మంగళవారం చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ జి వెంకట్రాం రెడ్డి చౌటుప్పల్ మండల కేంద్రంలో పెద్ద కొండూరు గ్రామంలోని చెరువు వద్ద గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గణేష్ నిమజ్జనం కోసం ఏర్పాటు చేసినటువంటి పనులు పరిశీలించారు. భక్తులకు అసౌకర్యం కలగనివ్వకుండా విద్యుత్ సదుపాయంతో పాటు ట్రైన్ల సహాయంతో గణపతి ప్రతిమలను నిమజ్జనం చేయుటకు తగినటువంటి చర్యలు ఏర్పాటు చేయడం జరిగినదన్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా గణేష్ నిమజ్జనం ఏర్పాట్లను పూర్తి చేసామన్నారు. గణేష్ నిమజ్జనం రోజు భక్తులు ప్రశాంతతను పాటిస్తూ భక్తితో గణేష్ నిమజ్జనాన్ని పూర్తి చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు శానిటరీ ఇన్స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్, జవాన్ అంజయ్య, మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# సమాజంలోని నిరుపేదల ఆరోగ్యానికి దాతృత్వ సేవా కార్యక్రమాలకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలి

- రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ యువనేత గాదె శివ చౌదరి






**కూకట్ పల్లి, సెప్టెంబర్ 02 (ప్రభాత సూర్య) :** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా బుధవారం గోపాల్ నగర్ లో వారి అభిమానులు ఏర్పాటు చేసిన వివిధ సేవా కార్యక్రమాల్లో భాగంగా రక్తదానం, మెడికల్ క్యాంపు, అన్నదాన కార్యక్రమాల్లో అభిమానుల ఆహ్వానం మేరకు కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ యువనేత గాదె శివ చౌదరి పాల్గొని రక్తదాతలకు ధృవీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా శివ చౌదరి మాట్లాడుతూ సంపాదనలో సగ భాగం సమాజాభివృద్ధి సంక్షేమం, దాతృత్య సేవా కార్యక్రమాలకు ఖర్చు చేసి సమ సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరు అనారోగ్యానికి గురైన అనేక మంది నిరుపేదలు రక్తదాతల ద్వారా తిరిగి మెరుగైన వైద్యం చేయించుకుని ఆరోగ్యవంతులుగా కుటుంబ సభ్యులతో కలిసిపోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, అజయ్, అనిల్, యువ నాయకులు రమణ, వరుణ్, పవన్ కళ్యాణ్ అభిమానులు పాల్గొన్నారు.

# నవజీవన్ నగర్ కాలనీ లో లడ్డు వేలంపాట

రూ.2,01,116 లక్షలకు దక్కించుకున్న జి త్రిమూర్తులు



**బాలానగర్, సెప్టెంబర్ 02 (ప్రభాత సూర్య) :** కూకట్ పల్లి నియోజకవర్గం, బాలానగర్ డివిజన్ లో గల నవజీవన్ కాలనీలో ప్రతిష్టించిన శ్రీశ్రీశ్రీ లక్ష్మీ విజయ గణపతి స్వామి వారు మహా మహిమాన్వితమైన శక్తి కలిగిన వారని తెలిపారు. దానికి తార్కాణాలు దృష్ట్యాంతాలు ఎన్నో ఉన్నాయి. ఆ స్వామివారి దయవల్ల నవజీవన్ నగర్ లో అందరూ సుఖశాంతులతో వర్ధిల్లుతున్నారు. సుమారుగా చాలా దూరం నుంచి కూడా ఈ మన లక్ష్మి గణపతిని దర్శించడానికి వస్తూ ఉంటారు. ఎంతోమంది తమ తమ కోరికలు నెరవేర్చుకొని స్వామివారికి మొక్కులు తీర్చుకుంటున్నారు. ఈ మధ్యనే స్వామివారికి మొత్తము వెండి కవచాన్ని కూడా భక్తుల సహాయ సహకారాలతో చేయించడం జరిగింది. ఇదంతా తమ, తమ కోరికను నెరవేర్చుకున్నటువంటి వాళ్ళు అందించినటువంటి కానుకలతో చేయించినటువంటిది. ఇక్కడ జరిగినట్టు సంకష్టహర చతుర్థి వ్రతం ఇంకెక్కడ జరగదు అనడంలో అతిశయోక్తి లేదు. ఇంతటి మహిమాన్వితమైన దేవాలయంలో చతుర్థి ఉత్సవాలలో జీ త్రిమూర్తులు సోమవారం రాత్రి రూ. 201116, రెండు లక్షల ఒక వెయ్యి 16 రూపాయల లడ్డును కైవసం చేసుకున్నారు. ఇంతకుముందు లడ్డును పొందిన వారు కూడా చాలా వరకు కూడా తన వ్యాపారాల్లో గాని, ఇతర వ్యవహారాల్లో గాని అభివృద్ధి పొందినటువంటి వారే. ఈ లక్ష్మీ విజయ గణపతిని దర్శించిన వారికి అన్ని రకాల విజయాలతో పాటు ఐశ్వర్యాధులు కూడా అందుతాయని చాలామంది ఉత్తమ అనుభవంతో చెప్పినటువంటి మాటలు కూడా ఇక్కడ అందరికీ గుర్తు చేస్తున్నాము. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు వ్యవస్థాపకులు శ్రీ శ్రీ విద్వాన్ రాఘవేంద్ర శర్మ, ప్రెసిడెంట్ పి రామ్మోహన్, జనరల్ సెక్రెటరీ ఆర్కే రాజు పటేల్, కోశాధికారి దయానంద్, వైస్ ప్రెసిడెంట్ సురేష్ సింఘానియా, రవీందర్, ఆంజనేయులు మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.

# పెన్షన్ దారుల మహా గర్జన సభను విజయవంతం చేయాలి

-ఎమ్మార్పీఎస్, ఎం.ఎస్.పి యాదాద్రి భువనగిరి జిల్లా ఇంచార్జ్ బిర్రు మహేందర్ మాదిగ



**చౌటుప్పల్. సెప్టెంబర్ 2. ప్రభాత సూర్య:** ఈనెల తొమ్మిదవ తేదీన చౌటుప్పల్ మండల కేంద్రానికి పెన్షన్ దారుల మహా గర్జన సభకు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ విచ్చేస్తున్న సందర్భంగా ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని చౌటుప్పల్ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి మాదిగ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా ఇన్చార్జి బిర్రు మహేందర్ మాదిగ హాజరై మాట్లాడుతూ...సెప్టెంబర్ 9వ తారీఖున చౌటుప్పల్ మండల కేంద్రంలో జరిగే పెన్షన్ దార్ల మహాగర్జన సన్నాక సమావేశానికి ముఖ్యఅతిథిగా పద్మశ్రీ మందకృష్ణ మాది హాజరవుతారని తెలిపారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగుల, చేనేత, బీడీ, గీతకార్మికుల పెన్షన్ పెంపు కొరకై చేయూత పెన్షన్ దారుల పెన్షన్ 2000 రూపాయలు నుండి 4000 రూపాయలు వరకు, వికలాంగుల పెన్షన్ 4000 నుండి 6000 పెంచేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కారుపై తాడోపేడో తేల్చుకునేందుకు చలో హైదరాబాద్ మహా గర్జన భారీ బహిరంగ సభను జయప్రదం చేయుటకై యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల కేంద్రంలో జరిగే సన్నాహక సదస్సుకు వివిధ మండలాల నుండి భారీ సంఖ్యలో పెన్షన్ దారులు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి యాదాద్రి భువనగిరి జిల్లా కో ఇన్చార్జి దుపెల్లి అనిల్ కుమార్ మాదిగ, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు దుబ్బా రామకృష్ణ మాదిగ, ఎం ఎస్ పి జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుక దేవేందర్ మాదిగ, విహెచ్పిఎస్ రాష్ట్ర నాయకులు బర్రె శంకర్ మాదిగ, వీరయ్య , దళిత సంఘం నాయకులు బోయ రామ చందర్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు బొడ్డు శ్రవణ్ కుమార్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షులు చీమ కండ్ల శ్రీనివాస్ మాదిగ , ఎంజేఫ్ జిల్లా అధ్యక్షులు ఊదరి శ్యామ్ మాదిగ ,ఎంఎస్పి జిల్లా నాయకులు కోళ్ల జహంగీర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ తాళ్ల సింగారం గ్రామ అధ్యక్షుడు కిరణ్ మాదిగతదితరులు పాల్గొన్నారు.

## ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో అన్నదానం



**సంస్థాన్ నారాయణపురం, సెప్టెంబర్ 02( ప్రభాత సూర్య)** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల పరిధిలోని చిమిర్యాల గ్రామంలో ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని దండుగుల రాములమ్మ గాలయ్య జ్ఞాపకార్థంగా కుమారులు దండుగుల నగేష్ అన్నప్రసాద దాతలుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో దోనూరు వీరారెడ్డి, ఉప్పల లింగస్వామి, దిండిగుల ప్రభాకర్, సుర్వి దయాకర్, ఉప్పల రమేష్,గడ్డం స్వామి, ఛత్రపతి యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు



**చిట్యాల, సెప్టెంబర్ 02(ప్రభాత సూర్య):** చిట్యాల మున్సిపాలిటీలో కనకదుర్గ సెంటర్ వద్ద పవనిజం మండల ఆర్గనైజర్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా కనకదుర్గ అమ్మవారి ఆలయంలో అర్చన చేయడం జరిగింది తదుపరి కేక్ కటింగ్ వేడుకలు నిర్వహించడం జరిగింది అలాగే ఆదరణ వృద్ధ ఆశ్రమంలో పండ్లు కూరగాయలు పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో నగరికల్ ఇంచార్జ్ రామలింగం పవనిజం మండల్ ఆర్గనైజర్ జిట్ట రమేష్, కృష్ణ,జిట్ట శేఖర్, లవ కుమార్, రవి, ఉషి, వాసు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు పట్టుదలతో చదివి విజయాలు సాధించాలి

-లింగోజిగూడెం జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు స్కూల్ షూస్ అందజేత...

-చౌటుప్పల్ జనసేన మండల పార్టీ అధ్యక్షులు పర్నే శివారెడ్డి



**చౌటుప్పల్. సెప్టెంబర్ 2. ప్రభాత సూర్య :** విద్యార్థులు పట్టుదలతో చదివి చక్కటి విజయాలను సాధించాలని చౌటుప్పల్ జనసేన మండల పార్టీ అధ్యక్షులు పర్నె శివారెడ్డి అన్నారు .జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా మంగళవారం చౌటుప్పల జనసేన మండల పార్టీ అధ్యక్షులు పర్నే శివారెడ్డి చౌటుప్పల్ మండలం, లింగోజిగూడెం గ్రామంలోని జడ్పీహెచ్ ఎస్ పాఠశాలకు సందర్శించి విద్యార్థులకు స్కూల్ షూస్ అందజేశారు. ఈ సందర్భంగా పర్నె శివారెడ్డి మాట్లాడుతూ... ప్రతిరోజు విద్యార్థులు క్రమశిక్షణతో స్కూల్ యూనిఫామ్ , షూస్ తో రావాలని తెలిపారు. అదేవిధంగా విద్యార్థులు పట్టుదలతో చదివి మంచి మార్కులు సాధించి ప్రైవేట్ స్కూలుకు దీటుగా మార్కులు సాధించి మీరు చదువుతున్న పాఠశాలకు గుర్తింపు తేవాలని అన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు బండి అనిల్ కుమార్ రెడ్డి, పెద్దగొని లింగస్వామి, బంగారు అంజి, బత్తిని గణేష్, సారా చంద్రశేఖర్, సిహెచ్.లింగస్వామి, రంజిత్,సిహెచ్. లింగస్వామి, అరుణ్, విద్యార్థులు పాల్గొన్నారు.


## వల్లభరావు చెరువును జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఐఏఎస్ తో కలిసి పరిశీలించిన జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ ఐపిఎస్



**నల్గొండ సెప్టెంబర్ 2 ప్రభాత సూర్య** జిల్లాలో రానున్న వినాయక నిమజ్జన కార్యక్రమానికి పోలీసు యంత్రాంగం పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు పూర్తి జిల్లా ఎస్పీ నిమజ్జన ప్రాంతానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా లైటింగ్,భారీ కేడింగ్, క్రేన్లు,తాగునీరు, పారిశుధ్యం,విద్యుత్ సరఫరా తదితర ఏర్పాట్ల పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు నిమజ్జన ప్రాంతాలలో సిసిటీవీ కెమెరాలు ఏర్పాటుతో పాటు ఏవైన అనుకోని సంఘటనలు చోటు చేసుకుంటే వెంటనే స్పందించడానికి అందుబాటులో గజ ఈతగాళ్ళునిమజ్జన ప్రాంతాలలో ప్రజలకు, వాహనదారులకు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు అన్ని శాఖల సమన్వయంతో ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం పూర్తి అయ్యేలా చర్యలు

## పేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోంది


టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్ బండి రమేష్



**కూకట్ పల్లి, సెప్టెంబర్ 02 (ప్రభత సూర్య) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందని టీపీసీసీ ఉపాధ్యక్షులు, జహీరాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని బాలానగర్, కూకట్ పల్లి మండలాల్లో సుమారు 163 మంది కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు రూ. కోటి 63 లక్షల 18 వేల 908లు విలువగల చెక్కులను ఆయన మంగళవారం రోజున ఆయా మండల కార్యాలయాల్లో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ కార్యక్రమాలు అందుతాయి అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## త్వరలో అందుబాటులోకి రానున్న ఆన్‌లైన్ గేమింగ్ చట్టం




ప్రభుత్వం ఆన్‌లైన్ గేమింగ్ చట్టం అతి త్వరలో అందుబాటులోకి వస్తుందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ కార్యదర్శి ఎస్ కృష్ణన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 21న ఆన్‌లైన్ గేమింగ్ ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ చట్టం–2025ని పార్లమెంటు ఆమోదించిన సంగతి తెలిసిందే. ఈ చట్టం ఈ–స్పోర్ట్స్, ఇతర ఆన్‌లైన్ గేమ్‌లను ప్రోత్సహిస్తూనే అన్ని రకాల ఆన్‌లైన్ మనీ గేమ్‌లను నిషేధిస్తుంది. ఇప్పటికే దీనికి రాష్ట్రపతి ఆమోదం కూడా లభించింది. ప్రభుత్వం నోటిఫై చేసిన తర్వాత ఈ చట్టం అమల్లోకి వస్తుంది. అనుకున్న సమయం కంటే చాలా త్వరగా ఈ చట్టం అమలులోకి వస్తుంది. అందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎస్ కృష్ణన్ సెమీకండక్టర్లపై జరిగిన ఐసీఈఏ ఈవెంట్ సందర్భంగా అన్నారు. గత వారం ఆర్థిక సేవల శాఖ, ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖతో బ్యాంకులు, ఫిన్‌టెక్ సంస్థలు జరిపిన సంయుక్త సమావేశంలో బిల్లు నిబంధనను అమలు చేయడానికి వివరణాత్మక మార్గదర్శకాలను, ఆన్‌లైన్ మనీ గేమ్‌ల కోసం లావాదేవీలను సమీక్ష నిర్వహించే వ్యవస్థను ఏర్పాటు చేయడానికి సమయాన్ని కోరాయి. ఈ చట్టం ఆన్‌లైన్ మనీ గేమ్‌లకు సంబంధించిన ప్రకటనలను, బ్యాంకులు, ఆర్థిక సంస్థలు అటువంటి గేమ్‌లలో నిధులను బదిలీ చేయకుండా నిషేధిస్తుంది. అందుకే బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ఆర్థిక పరమైన లావాదేవీల తనిఖీలకు సమయం కోరాయి. ఆన్‌లైన్ మనీ గేమ్స్ గురించి యాడ్స్ వేస్తే 2 ఏళ్ల జైలుశిక్ష, రూ. 50 లక్షల జరిమానా విధించనున్నారు. అంతేకాకుండా ఆన్‌లైన్ మనీ గేమ్స్‌కు ఆర్థిక సహకారం అందించే వారికి 3 ఏళ్ల జైలుశిక్ష, రూ. కోటి వరకు జరిమానా విధిస్తారు. పదే పదే చట్టాన్ని ఉల్లంఘిస్తే 3–5 ఏళ్ల జైలు శిక్ష, రూ. 2 కోట్ల జరిమానా విధించనున్నారు.

## రూ. 1.05 లక్షల మార్కు దాటిన బంగారం



బంగారం ధరలు హద్దుల్లేకుండా దూసుకెళు_న్నాయి. ఇప్పటికే భారీగా పెరిగిన ధరలను చూసి సామాన్యులు కొనేందుకు దూరమవుతుండగా, తాజాగా పసిడి ధరలు సరికొత్త రికార్డు గరిష్టాలకు చేరాయి. వరుసగా ఆరో రోజు బంగారం రూ. 1,000 పెరగడంతో దేశ రాజధానిలో సోమవారం పది గ్రాములు రూ. 1,05,670 వద్ద కొత్త గరిష్ఠాలను తాకింది. ఇందుకు ప్రధానంగా అమెరికా ఫెడ్ రేట్లను తగ్గిస్తుందనే అంచనాలు, గ్లోబల్ మార్కెట్లలో డిమాండ్ పెరగడంతో ధరలు ఒక్కసారిగా పెరిగాయి. ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ ప్రకారం హైదరాబాద్ మార్కెట్లో 99.5 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం సోమవారం రూ.930 పెరిగి 10 గ్రాములకు రూ.1,05,880 (అన్ని పన్నులు కలిపి) జీవితకాల గరిష్ట స్థాయికి చేరుకుంది. ఆభరణాల తయారీలో వాడే 22 క్యారెట్ల పసిడి రూ. 850 పెరిగి రూ. 97,050 వద్దకు చేరింది. యూఎస్ ఫెడ్ వ్యవహారంలో పెరుగుతున్న ఆందోళనలు, టారిఫ్ విధానాలపై పెరిగిన అనిశ్చితి మధ్య పెట్టుబడిదారులు సురక్షితమైన ఆస్తుల వైపు మొగ్గు చూపడంతో ధరలు అత్యధికంగా పెరుగుతున్నాయని వ్యాపారులు తెలిపారు. మరోవైపు వెండి ధరలు కూడా రూ. 1,000 పెరిగి కిలోగ్రాముకు రూ. 1,36,000 (అన్ని పన్నులు కలిపి) కొత్త గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. క్లీన్ ఎనర్జీ, ఎలక్ట్రానిక్స్‌లో డిమాండ్ కారణంగా దేశీయ మార్కెట్లలో వెండి రికార్డు స్థాయిలో పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లలో స్పాట్ గోల్డ్ ఔన్సుకు 3,470.51 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# నిబంధనల ప్రకారమే రష్యా చమురు కొనుగోళ్లు



రష్యా చమురు, ఇంధన వాణిజ్యాన్ని కొనుగోలు చేయడంలో భారత్ ఎటువంటి నియమాలను ఉల్లంఘించలేదని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి స్పష్టం చేశారు. సోమవారం ఓ జాతీయ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన.. భారత ప్రభుత్వం అంతర్జాతీయ నిబంధనలను గౌరవించడంతోనే గ్లోబల్ మార్కెట్లలో చమురు ధరలు పెరగకుండా స్థిరంగా ఉన్నాయి. ఈ సందర్భంగా వైట్‌హౌస్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో రష్యా చమురుకు భారత్ 'లాండ్రోమ్యాట్'గా మారిందన్న వ్యాఖలను కేంద్ర మంత్రి తోసిపుచ్చారు. ఆయన వ్యాఖ్యలు వాస్తవానికి ఏ మాత్రం పొంతనలేదని తెలిపారు. అంతేకాకుండా రష్యా చమురును కొనుగోలు చేసి భారత్ లాభపడిందనే వ్యాఖ్యలనూ ఆయన తిప్పికొట్టారు. 2022లో రష్యా ఉక్రెయిన్‌పై దాడి చేయడానికి చాలా కాలం ముందు నుంచే భారత్ అతిపెద్ద పెట్రోలియం ఉత్పత్తులను ఎగుమతి చేసే దేశంగా ఉందని, ఎగుమతుల పరిమాణం, మార్జిన్‌లు అంతే ఉన్నాయని అన్నారు. కొంతమంది విమర్శకులు భారత్ రష్యా చమురు కోసం 'లాండ్రోమాట్'గా మారిందని ఆరోపిస్తున్నారు. అందులో ఏ మాత్రం నిజం లేదనిని పేర్కొన్నారు. రష్యా నుంచి కొనే చమురు ధరలు జీ7 దేశాలు విధించే ప్రైస్ క్యాప్‌కు అనుకూలంగా ఉన్నాయి. ఈ ప్రైస్ క్యాప్ జీ7 దేశాలు రష్యా ఆదాయాన్ని నియంత్రించడం కోసం తెచ్చిందనే విషయాన్ని గుర్తించుకోవాలి. ప్రపంచ చమురు ధరలను స్థిరంగా ఉండటంలో కీలక యంత్రాంగంగా భారత్ పని చేస్తోందని మంత్రి వెల్లడించారు. కాగా, ఇటీవల పీటర్ నవారో మాట్లాడుతూ, భారత్ లాండ్రోమ్యాట్‌గా ఉండటం మూలంగా ఓ వర్గం లాభపడుతోంది. అందుకు భారత్ తన ప్రజలను పణంగా పెడుతోందని, దాన్ని అడ్డుకోవాలన్నారు. ఉక్రెయిన్ ప్రజలను బలి తీసుకుంటున్న ఈ ధోరణి, అమెరికనలు చెల్లింపుదారులుగా ఏం చేయాలనేది చూడాలన్నారు. భారత్ లాంటి అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి అధినేత నరేంద్ర మోడీ పుతిన్, జిన్‌పింగ్‌లతో ఎందుకని అంటకాగుతున్నారో అర్థం కావట్లేదని అన్నారు. ఈ క్రమంలోనే హర్దీప్ సింగ్ తాజా వ్యాఖ్యలు చేశారు.

# యూపీఐ ఆగస్టులో 20 బిలియన్ లావాదేవీల రికార్డు




భారతదేశ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) చారిత్రక ఘనత సాధించింది. తొలిసారిగా ఒకే నెలలో 20.01 బిలియన్ (2000 కోట్లు) లావాదేవీల మార్కును అధిగమించి సరికొత్త రికార్డు నెలకొల్పింది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) ఆగస్టు 2025 గణాంకాలను సోమవారం విడుదల చేసింది, ఇది యూపీఐ యొక్క విశేష వృద్ధిని స్పష్టం చేస్తుంది. ఎన్‌పీసీఐ డేటా ప్రకారం, ఆగస్టు 2025లో యూపీఐ ద్వారా 20.01 బిలియన్ లావాదేవీలు నమోదయ్యాయి, ఇది జులై నెలలో నమోదైన 19.47 బిలియన్ లావాదేవీలతో పోలిస్తే 2.8 శాతం అధికం. వార్షిక ప్రాతిపదికన, ఈ వృద్ధి 34 శాతంగా ఉంది. లావాదేవీల విలువ రూ.24.85 లక్షల కోట్లుగా నమోదైంది, గత ఏడాదితో పోలిస్తే 24 శాతం పెరుగుదలను సూచిస్తుంది. సగటున రోజుకు 645 మిలియన్ లావాదేవీలు జరిగాయని, ఒక్కో రోజు సగటు విలువ రూ.80,177 కోట్లుగా ఉందని ఎన్‌పీసీఐ తెలిపింది. ఆగస్టు 2న ఒకే రోజు 700 మిలియన్ లావాదేవీలతో యూపీఐ మరో రికార్డు సృష్టించింది. ఎస్బీఐ రీసెర్చ్ నివేదిక ప్రకారం, డిజిటల్ చెల్లింపుల్లో మహారాష్ట్ర 9.8 శాతం వాటాతో అగ్రస్థానంలో నిలిచింది, కర్ణాటక (5.5 శాతం) మరియు ఉత్తరప్రదేశ్ (5.3 శాతం) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. పీ2ఎం (వినియోగదారుల నుంచి వ్యాపారులకు) లావాదేవీలు గణనీయంగా పెరిగాయి, 2020 జూన్‌లో 39 శాతంగా ఉన్న వాటా 2025 జులై నాటికి 64 శాతానికి చేరింది. కిరాణా సామాను (24.3 శాతం లావాదేవీలు) మరియు రుణ వసూళ్లు (12.8 శాతం విలువ) వంటి విభాగాల్లో యూపీఐ వాడకం అధికంగా ఉంది. యూపీఐ లావాదేవీల వృద్ధి దేశంలో చలామణిలో ఉన్న నగదు (సీఐసీ) కంటే చాలా వేగంగా ఉందని ఎస్బీఐ నివేదిక సూచిస్తుంది. 2025 ఏప్రిల్–జులై మధ్య యూపీఐ సగటు నెలవారీ లావాదేవీల విలువ రూ.24,554 బిలియన్‌గా ఉండగా, సీఐసీ వృద్ధి కేవలం రూ.193 బిలియన్‌గా ఉంది. ఈ వేగవంతమైన వృద్ధి ఆర్థిక సమ్మిళితత్వాన్ని ప్రోత్సహిస్తోంది, డిజిటల్ చెల్లింపుల ద్వారా వ్యాపారులు మరియు వినియోగదారులకు సౌలభ్యాన్ని అందిస్తోంది. ఆగస్టు 2025లో యూపీఐ 20.01 బిలియన్ లావాదేవీలను నమోదు చేసింది, ఇది చరిత్రలో తొలిసారిగా 20 బిలియన్ మార్కును అధిగమించింది.

# కొత్త స్పాన్సర్ వేటలో బీసీసీఐ.. రూ.300 కోట్ల టర్నోవర్ ఉంటేనే ఛాన్స్!




భారత క్రికెట్ నియంత్రణ మండలి కొత్త జెర్సీ స్పాన్సర్ వేటలో పడింది. కేంద్ర తీసుకొచ్చిన ఆన్‌లైన్ గేమింగ్, గ్యాంబ్లింగ్ నియంత్రణ చట్టం కారణంగా డ్రీమ్ 11తో ఒప్పందం రద్దు చేసుకున్న బీసీసీఐ.. టీమిండియా కొత్త స్పాన్సర్ కోసం దరఖాస్తులు ఆహ్వానించింది. ఆసక్తి గల కంపెనీల నుంచి బిడ్డింగ్ స్వీకరిస్తామని తెలిపింది. స్పాన్సర్ నియమ నిబంధనల గురించిన వివరాలు సెప్టెంబర్ 2 మంగళవారం నుంచి అందుబాటులో ఉంచనుంది. అంతేకాదు దరఖాస్తులు సమర్పించేందుకు సెప్టెంబర్ 16 తుది గడువుగా నిర్ణయించింది బీసీసీఐ. కొత్త స్పాన్సర్ ఎంపిక విషయంలో మాకు స్పష్టత ఉంది. ప్రభుత్వం ఆన్‌లైన్ గేమింగ్‌పై నిషేధం విధించినందున డ్రీమ్ 11 వంటి సంస్థలతో బీసీసీఐ స్పాన్సర్‌షిప్‌ను కొనసాగించదు. కొత్తగా అమల్లోకి వచ్చిన ఆంక్షల కారణంగా డ్రీమ్ 11తో ఒప్పందం ముగిసిపోయింది. అందుకే కొత్త స్పాన్సర్ ఎంపిక కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాం. ఆశావహులు సెప్టెంబర్ 16లోపు బిడ్డింగ్ వేయాలి అని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా వెల్లడించాడు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా కొత్త స్పాన్సర్ ఎంపిక చేపట్టనుంది బీసీసీఐ. అందుకే.. స్పాన్సర్‌కు ఉండాల్సిన అర్హత ప్రమాణాలను వెబ్‌సైట్‌లో పెట్టింది. ఆర్థికంగా, వ్యక్తిగతంగా కొన్ని లక్షణాలు ఉన్న వాటినే పరిశీలిస్తామని భారత బోర్డు స్పష్టంగా పేర్కొంది. అవేంటంటే.. గత మూడేళ్ల కాలంలో కంపెనీ టర్నోవర్ సగటున రూ.300 కోట్లు ఉండాలి. కంపెనీ నికర ఆస్తుల విలువ గత మూడేళ్లలో రూ.300 కోట్లు ఉండి తీరాలి.

**వ్యక్తిగతంగా అయితే..**

కంపెనీపై, ఆ సంస్థ యజమానిపై ఎటువంటి క్రిమినల్ కేసులు ఉండకూడదు. మోసాలకు పాల్పడం, ఆర్థిక నేరాల్లో భాగమవ్వడం వంటివి అన్నమాట. బీసీసీఐ నిబంధనల ప్రకారం ఆర్థికపరమైన ప్రయోజనాల్లో వైరుధ్యం ఉండకూడదు. ఏదైనా నేరం కింద రెండేళ్లకు పైగా జైలు జీవితం అనుభవించకూడదు. మరీ ముఖ్యంగా రిజర్వ్ బ్యాంక్ ఇండియా జాబితాలో ఉద్దేశపూర్వక ఎగవేతదారుగా ఉండకూడదు. అథ్లెటిక్స్, క్రీడా దుస్తులతో పాటు పరికరాల తయారీ కంపెనీలు బిడ్డింగ్ వేయవచ్చు. బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు, ఫైనాన్షియల్ సర్వీస్ అందించే కంపెనీలు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆల్కహాల్ లేని శీతల పానీయాల కంపెనీలు కూడా అర్హులే. బీమా కంపెనీలతో పాటు ఫ్యాన్స్ మిక్సర్ గ్రౌండర్స్, సేఫ్టీ లాక్స్ సంస్థలు కూడా ఆసక్తి ఉంటే బిడ్డింగ్‌లో పాల్గొనవచ్చు.

**బిడ్డింగ్‌కు వీళ్లు అనర్హులు**

ఆన్‌లైన్ మనీ గేమింగ్, బెట్టింగ్ లేదా గ్యాంబ్లింగ్‌తో సంబంధం ఉన్న కంపెనీలు. క్రిప్టో కరెన్సీకి సంబంధించిన వ్యాపారాలతో ముడిపడి ఉన్న కంపెనీలు. ఆన్‌లైన్ గేమింగ్ నియంత్రణ చట్టం 2025 ప్రకారం నిషేధిత జాబితాలో ఉన్న కంపెనీలు. యూఏఈ వేదికగా సెప్టెంబర్ 9 నుంచి ఆసియా కప్ ప్రారంభం కానుంది. ఈ మెగా టోర్నీకి ముందే జెర్సీ స్పాన్సర్‌గా ఉన్న డ్రీమ్ 11తో ఒప్పందం రద్దు కావడంతో టీమిండియా స్పాన్సర్ లేకుండానే బరిలోకి దిగనుంది. అయితే.. ఆసియా కప్ జరుగుతుండగానే కొత్త స్పాన్సర్‌ను వెతికే పనిలో పడింది బీసీసీఐ. తొలి పోరులో భారత్ సెప్టెంబర్ 10న ఆతిథ్య యూఏఈతో.. సెప్టెంబర్ 14న పాకిస్థాన్‌తో.. సెప్టెంబర్ 19న ఒమన్‌తోతలపడనుంది.

## బుమ్రాతో నాకు పోలికా?.. మేమిద్దరం..: వసీం అక్రమ్



జస్ప్రీత్ బుమ్రా.. ప్రపంచంలోనే అత్యుత్తమ బౌలర్లలో ఒకడిగా కొనసాగుతున్నాడు. అన్ని ఫార్మాట్లలో టీమిండియా పేస్ దళానికి నాయకుడిగా వ్యవహరిస్తున్నాడు. బుమ్రా బౌలింగ్ చేస్తుంటే ప్రత్యర్థి బ్యాటర్ వెన్నులో వణుకు పుట్టాల్సిందే. ఇంగ్లండ్ పర్యటనలో కేవలం మూడు టెస్టులు మాత్రమే ఆడినప్పటికి తన అత్యుత్తుమ ప్రదర్శనను బుమ్రా ఇచ్చాడు. ఇటీవలే తన ఫిట్‌నెస్ టెస్టులను క్లియర్ చేసిన ఈ టీమిండియా పేస్ గుర్రం.. ఆసియాకప్–2025కు సిద్ధమవుతున్నాడు. ఈ నేపథ్యంలో బుమ్రాపై పాకిస్తాన్ మాజీ కెప్టెన్, స్వింగ్ సుల్తాన్ వసీం అక్రమ్ ప్రశంసల వర్షం కురిపించాడు. ప్రస్తుత తరంలో బుమ్రాను మించిన బౌలర్ మరొకరు లేరని అక్రమ్ కొనయాడాడు. అదేవిధంగా బుమ్రాను తన పోల్చడంపై ఈ పాక్ దిగ్గజం స్పందించాడు. కాగా ఇప్పటికే చాలా సందర్భాల్లో మాజీలు బుమ్రాను అక్రమ్‌తో పోల్చారు. ఆండర్సన్–టెండూల్కర్ ట్రోఫీలో కామెంటేటర్‌గా వ్యవహరించిన భారత మాజీ పేసర్ వరుణ్ అరుణ్ అయితే ఏకంగా వసీం అక్రమ్ కంటే బెటర్ బౌలర్ అని పేర్కొన్నాడు. అయితే వసీం అక్రమ్ కూడా 90లలో తన పేస్ బౌలింగ్‌తో ప్రత్యర్థి బ్యాటర్లకు చుక్కలు చూపించేవాడు. "జస్ప్రీత్ బుమ్రా ప్రపంచంలోని గొప్ప బౌలర్లలో ఒకడు. అతడికి అద్భుతమైన బౌలింగ్ యాక్షన్ ఉంది. మంచి వేగంతో కూడా బౌలింగ్ చేయగలడు. అయితే 90లలో ఆడిన బౌలర్లను ఇప్పుడు ఉన్న బౌలర్లతో పోల్చడం సరికాదు. అతను కుడిచేతి వాటం బౌలర్, నేను ఎడమచేతి వాటం బౌలర్‌ని. అతడితో నన్ను ఎలా పోలుస్తారు. బుమ్రా బౌలింగ్ యాక్షన్ వేరు, నా బౌలింగ్ యాక్షన్ వేరు. సోషల్ మీడియాలో ఇటువంటి చర్చలు నేను తరుచుగా చూస్తున్నాను. ఊళ్లో పెళ్లికి కుక్కల హడావుడిలా ఉంది. ఈ మాజీ క్రికెటర్ల చర్చలను నేను పట్టించుకోను. బుమ్రా కూడా పట్టించుకోడు. ఈ తరంలో బుమ్రా గొప్ప బౌలర్. మా జనరేషన్‌లో మా స్దాయికి తగ్గట్టు మేము రాణించాము. కాబట్టి రెండు తరాలను పోల్చాల్సిన అవసరం లేదని జియో న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అక్రమ్ పేర్కొన్నాడు.

# స్పోర్ట్స్

## 'ఆసియా కప్-2025లోనూ అతడిని ఆడించరు.. మళ్లీ బెంచ్ మీదే'





టీమిండియాకు దొరికిన అదురైన లెఫ్టార్మ్ స్పిన్నర్లలో కుల్దీప్ యాదవ్ ఒకడు. అండర్–19 ప్రపంచకప్–2014లో భారత్ తరఫున ఆరు ఇన్నింగ్స్‌లో పద్నాలుగు వికెట్లు కూల్చి వెలుగులోకి వచ్చాడీ కాన్పూర్ 'కుర్రాడు'. ఆ తర్వాత దేశీ క్రికెట్లో, ఐపీఎల్‌లో రాణించి టీమిండియాకు ఆడే అవకాశం దక్కించుకున్నాడు. చైనామన్ స్పిన్నర్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు దక్కించుకున్న కుల్దీప్ యాదవ్.. ఇప్పటికే మ్యాచ్ విన్నర్‌గా నిరూపించుకున్నాడు. గతేడాది సొంతగడ్డపై ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌ను భారత్ 4–1తో గెలవడంలో కుల్దీప్‌ది కీలక పాత్ర. అదే విధంగా.. టీ20 ప్రపంచకప్–2024, ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ–2025 టైటిళ్లను టీమిండియా సొంతం చేసుకోవడంలోనూ అతడు కీలకంగా వ్యవహరించాడు. అయినప్పటికీ చాన్నాళ్లుగా కుల్దీప్ బెంచ్‌కే పరిమితమవుతున్నాడు. ఇటీవల ఇంగ్లండ్ పర్యటనలో భాగంగా ఐదు టెస్టుల్లోనూ అతడికి ఆడే అవకాశం రాలేదు. మార్చిలో చివరగా టీమిండియాకు ఆడిన కుల్దీప్ యాదవ్.. ఆసియా కప్–2025 టోర్నమెంట్‌తో పునరాగమనం చేసే అవకాశం ఉంది.

**ఇంగ్లండ్‌లో ఆడిస్తే గెలిచేవాళ్లం**

అయితే, ఈ టీ20 టోర్నీలోనూ కుల్దీప్ యాదవ్ బెంచ్‌కే పరిమితమయ్యే అవకాశం ఉందని.. భారత మాజీ స్పిన్నర్ మణిందర్ సింగ్ అంటున్నాడు. "ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లో కుల్దీప్ యాదవ్‌ను ఆడించి ఉంటే.. టీమిండియా 3–1తో గెలిచేది. కుల్దీప్ లాంటి బౌలర్లు అరుదుగా ఉంటారు. ఇంగ్లిష్ బ్యాటర్లు అతడి బౌలింగ్‌లో ఇబ్బందిపడేవారు. అతడి గూగ్లీలను వాళ్లు రీడ్ చేయలేకపోయేవారు. తొలి టెస్టులో వాళ్లు 371 పరుగుల లక్ష్యాన్ని ఛేదించారు. ఆ సమయంలో కుల్దీప్ గనుక మైదానంలో ఉండి ఉంటే ఇలా జరిగేదే కాదు. ఈసారి కూడా బెంచ్ మీదే!

ఇక ఆసియా కప్ టోర్నీలోనూ ఇద్దరు స్పిన్నర్లను మాత్రమే ఆడించాలని భావిస్తే.. మేనేజ్‌మెంట్ కుల్దీప్ యాదవ్‌ను ఈసారి కూడా పక్కనపెట్టవచ్చు. వరుణ్ చక్రవర్తిని ఆడిస్తారు. బ్యాటింగ్ కూడా చేయగలడు కాబట్టి అక్షర్ పటేల్‌ను తీసుకుంటారు" అని మణిందర్ సింగ్ ఇండియా టుడేతో పేర్కొన్నాడు. కాగా సెప్టెంబరు 9– 28 వరకు యూఏఈ వేదికగా ఆసియా కప్ టోర్నీ నిర్వహణకు షెడ్యూల్ ఖరారైంది. ఇదిలా ఉంటే.. చివరగా ఇంగ్లండ్‌లో పర్యటించిన టీమిండియా ఆండర్సన్– టెండుల్కర్ ట్రోఫీని 2–2తో సమం చేసిన విషయం తెలిసిందే. ఇక ఈ టూర్‌తోనే శుబ్‌మన్ గిల్ టీమిండియా టెస్టు సారథిగా ప్రయాణం ఆరంభించాడు. బౌలింగ్ దళంలో పేసర్లు మహ్మద్ సిరాజ్, జస్‌ప్రీత్ బుమ్రా, ఆకాశ్ దీప్, ప్రసిద్ కృష్ణ కీలకంగా వ్యవహరించగా.. స్పిన్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా కూడా సత్తా చాటాడు.




## ‘మట్టి కుస్తీ’కి సీక్వెల్‌ను ప్రకటించిన విష్ణు విశాల్

తమిళ నటుడు విష్ణు విశాల్ కథానాయకుడిగా నటించిన బ్లాక్ బస్టర్ చిత్రం ‘గట్ట కుస్తీ’ (తెలుగులో మట్టి కుస్తీ) స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చిన ఈ చిత్రం 2022లో విడుదలై తమిళంతో పాటు తెలుగులో మంచి విజయాన్ని అందుకుంది. అయితే తాజాగా ఈ సినిమాకి సీక్వెల్‌ను ప్రకటించారు మేకర్స్. కథానాయకుడు విష్ణు విశాల్ స్వయంగా ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సినిమాకి ‘గట్ట కుస్తీ 2’ అని పేరు పెట్టారు. దీనికి సంబంధించిన ఒక అనౌన్స్‌మెంట్ వీడియోను చిత్రయూనిట్ తాజాగా విడుదల చేసింది. ‘గట్ట కుస్తీ’ సినిమాకు దర్శకత్వం వహించిన చెల్లా అయ్యావు ఈ సీక్వెల్‌కు కూడా దర్శకత్వం వహించబోతుండగా.. మొదటి భాగంలో నటించిన విష్ణు విశాల్, ఐశ్వర్య లక్ష్మీ ఈ సీక్వెల్‌లో కూడా ప్రధాన పాత్రల్లో కనిపించనున్నారు. అలాగే, కరుణాస్, మునీష్కాంత్, కాళీ వెంకట్ వంటి నటులు కూడా ఇందులో కొనసాగనున్నారు. విష్ణు విశాల్ తన సొంత నిర్మాణ సంస్థ ‘విష్ణు విశాల్ స్టూడియోస్’తో పాటు ‘వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్’తో కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.




## సెకండ్ పార్ట్‌లో హీరో అతడే.. మెయిన్ విలన్ క్లూ

గత వీకెండ్‌లో మూడు నాలుగు తెలుగు సినిమాలు రిలీజైతే వాటిలో కొన్నింటికి పాజిటివ్ టాక్ వచ్చింది. కానీ జనాలు పెద్దగా ఇంట్రెస్ట్ చూపించట్లేదు. మరోవైపు మలయాళ డబ్బింగ్ మూవీ ‘కొత్త లోక’కి తెలుగులో ఓ మాదిరి రెస్పాన్స్ వచ్చింది. మెట్రో సిటీల్లో ఆదివారం వరకు మంచి ఆక్యుపెన్సీ చూపించింది. తొలి నుంచి ఇది సూపర్ హీరో తరహా యూనివర్స్ అని చెప్పిన టీమ్.. ఇప్పుడు మరిన్ని ఆసక్తికర విషయాల్ని రివీల్ చేసింది. మనం పురాణాల్లో విన్న యక్షిణి పాత్రని తీసుకుని, దానికి సూపర్ పవర్స్ జోడించి ‘కొత్త లోక’ సినిమాని తీశారు. కల్యాణి ప్రియదర్శన్ లీడ్ రోల్ చేసింది. బడ్జెట్ కూడా రూ.35-40 కోట్ల మధ్యనే అని టాక్. అయితే ఇంత తక్కువ బడ్జెట్ పెట్టి ఈ రేంజు ఔట్ పుట్ చూపించడంపై ప్రేక్షకులు ఆశ్చర్యపోతున్నారు. సినిమా పాజిటివ్ టాక్ రావడంతో పాటు రూ.60-70 కోట్ల వరకు కలెక్షన్స్ వచ్చినట్లు తెలుస్తోంది. అంటే లాభాల్లోకి ఎంటరైనట్లే. తాజాగా ఈ చిత్రానికి వస్తున్న ఆదరణ గురించి మాట్లాడిన దర్శకుడు డొమినిక్ అరుణ్.. ఈ మూవీ ఫ్రాంచైజీలో మొత్తం ఐదు పార్ట్స్ ఉంటాయని చెప్పుకొచ్చాడు. అలానే ‘కొత్త లోక’ సినిమా ప్రారంభంలోనే మెయిన్ విలన్ ఎవరనేది హింట్ ఇచ్చామని పేర్కొన్నాడు. ఐదు భాగాలకు సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ అంతా షూటింగ్ మొదలవకముందే పూర్తి చేశామని క్లారిటీ ఇచ్చాడు. ఈ మూవీలో అతిథి పాత్రలో కనిపించి ఆకట్టుకున్న టొవినో థామస్.. రెండో పార్ట్‌లో లీడ్ రోల్ చేస్తాడనే రూమర్స్ వినిపిస్తున్నాయి. అయితే ‘కొత్త లోక’ తొలి పార్ట్ చివరలో దుల్కర్ సల్మాన్ కూడా కనిపించాడు. రాబోయే పార్ట్స్‌లో ఏదో ఒకదానిలో దుల్కర్ కూడా కచ్చితంగా ఉండటం గ్యారంటీ. ఇప్పటివరకు కమర్షియల్‌గా గుర్తింపు తెచ్చుకున్న కల్యాణి.. ఈ సినిమాతో మరింతగా క్రేజ్ సంపాదిస్తుండటం విశేషం.

## ‘ఓజీ’ కొత్త గ్లింప్స్.. విలన్ పాత్ర పరిచయం

‘ఓజీ’ సినిమా నుంచి కొత్త గ్లింప్స్ రిలీజ్ చేశారు. పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ఉదయం.. కారుపై ఓజీ కూర్చున్న ఓ కొత్త లుక్ రిలీజ్ చేశారు. ఇప్పుడు గ్లింప్స్ వీడియో విడుదల చేశారు. ఇందులో విలన్ పాత్రధారిని పరిచయం చేశారు. అతడి పాత్ర పేరు ఓమి. బాలీవుడ్ స్టార్ ఇమ్రాన్ హష్మీ ఈ రోల్ చేశాడు. సదరు పాత్రతో గ్లింప్స్ చివరలో హ్యాపీ బర్త్ డే ఓజీ అని చెప్పించారు. అంతా బాగానే ఉంది గానీ పవన్ పుట్టినరోజు సందర్భంగా అతడిని హైలైట్ చేసే గ్లింప్స్ లాంటిది పడితే అభిమానులు కాస్త ఖుషీ అయ్యేవారు. అలా కాకుండా హీరో కంటే విలన్ పాత్రకు ఎక్కువ ఎలివేషన్స్ ఇచ్చేలా గ్లింప్స్ రిలీజ్ చేయడం కాస్త విచిత్రంగా అనిపించింది.  ఎప్పటిలానే బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్, విజువల్స్ బాగున్నాయి. పవన్ కల్యాణ్ హీరోగా నటించిన ఈ గ్యాంగ్ స్టర్ డ్రామాని ఈ నెల 25న థియేటర్లలో రిలీజ్ చేయనున్నారు. సుజీత్ దర్శకుడు కాగా తమన్ సంగీతమందించాడు. డీవీవీ దానయ్య నిర్మాతగా వ్యవహరించారు. ప్రస్తుతం ఈ సినిమాకు అభిమానుల్లో బజ్ గట్టిగానే ఉంది. పవన్ గత చిత్రం ‘హరిహర వీరమల్లు’ దారుణంగా ఫెయిల్ అవడంతో ఈ మూవీపై ఫ్యాన్స్ బోలెడు ఆశలు పెట్టుకున్నారు. మరి ఏం జరుగుతుందో చూడాలి?





## బెల్లంకొండ సినిమా వాయిదా.. కానీ

తెలుగులో ఒకప్పుడు వరుసగా సినిమాలు చేస్తూ.. అప్పుడప్పుడూ విజయాలు అందుకుంటూ కెరీర్‌ను బాగానే ముందుకు తీసుకెళ్లాడు బెల్లంకొండ శ్రీనివాస్. కానీ మధ్యలో ‘ఛత్రపతి’ బాలీవుడ్ రీమేక్‌లో నటించడం తన కెరీర్‌కు పెద్ద డ్యామేజీ అయింది. ఆ సినిమా హిందీలో సరిగా ఆడలేదు. పైగా తెలుగులో బాగా గ్యాప్ వచ్చింది. ఈ విరామం తర్వాత ‘భైరవం’ చిత్రంలో నటిస్తే అది నిరాశపరిచింది. ఐతే తన కొత్త చిత్రం ‘కిష్కింధపురి’ మీద బెల్లంకొండ శ్రీనివాస్ చాలా నమ్మకంగా ఉన్నాడు. కార్తికేయతో ‘చావు కబురు చల్లగా’ సినిమా తీసిన కౌశిక్ పెగల్లపాటి ఈ చిత్రాన్ని రూపొందించాడు. ఇది డివైన్ ఎలిమెంట్స్‌తో ముడిపడ్డ ఫాంటసీ హార్రర్ మూవీ. దీని టీజర్ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచింది. ‘రాక్షసుడు’ తర్వాత శ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్ కలిసి నటించిన చిత్రమిది. షెడ్యూల్ ప్రకారం సెప్టెంబరు 12న ‘కిష్కింధపురి’ రిలీజ్ కావాలి. ఐతే అదే రోజు ‘మిరాయ్’ భారీ అంచనాల మధ్య రిలీజవుతుండడంతో దానికి పోటీగా వెళ్లకపోవడం మంచిదే అన్న సందేహాలు కలిగాయి. రిలీజ్ డేట్ మార్చక తప్పదని అనుకున్నారు. ఆ ప్రకారమే ‘కిష్కింధపురి’ వాయిదా పడింది. అలా అని వారం, రెండు వారాలేమీ పోస్ట్ పోన్ చేయలేదు. ఒక్క రోజు ఆలస్యంగా సెప్టెంబరు 13న ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నారు. 13న అన్నది హార్రర్ చిత్రాలకు సెంటిమెంటుగా కలిసొచ్చే డేట్. హార్రర్ చిత్రాల టైటిళ్లు కూడా ఈ నంబర్‌తో పెడుతుంటారు. ‘13 బి’ అందుకు ఉదాహరణ.

## సరికొత్త అందాలతో మెరిసిన ఖుషి కపూర్



Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.